


# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

కర్నూలు నంద్యాల

సోమవారం | 02 జూన్ 2025

పేజీలు 8


## ఉనికి కోల్పోతున్న ఉర్దూ పాఠశాలలు

- ఉర్దూ బోధన .. వేదన
- విద్యకు దూరమవుతున్న బాలికలు



పట్టణంలోని ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాల

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** ఉర్దూ పాఠశాలల్లో దాదాపు వంద శాతం ముస్లిం విద్యార్థులే చదువుతుంటారు. ముస్లిం మైనార్టీ జనాభా అధికంగా ఉన్న తాలూకాలో ఆళ్లగడ్డ ఒకటి. ఆళ్లగడ్డ తాలూకాలో ఉర్దూ విద్యకు గడ్డు రోజులు కొనసాగుతున్నాయి. ఆళ్లగడ్డ తాలూకాలో ఉర్దూ మాధ్యమంలో పది వరకు చదువుకున్న విద్యార్థులు ఇంటర్మీడియట్ చదవాలంటే నంద్యాల లేదాఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిందే.. నియోజకవర్గంలో ఎక్కడ కూడ ఉర్దూ మాధ్యమ కళాశాల లేకపోవడం గమనార్హం..గత్యంతరం లేక 10 వరకు చదివిన విద్యార్థులు కొందరు అక్కడితోనే చదువుల్ని ఆపేస్తుండగా, మరి కొందరు ఇతర ప్రాంతాల్లోని

మిగతా 2లో



ఓబులంపల్లి ఉర్దూ ప్రాథమిక పాఠశాల,



కోట కందుకూరులోని ఉర్దూ ప్రాథమిక పాఠశాల

## ఏసీబీ వలలో నాల్గవ పట్టణ సిఐ,హెడ్ కానిస్టేబుల్

- రూ.80వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ హెడ్ కానిస్టేబుల్
- కౌంటర్ కేసు నమోదు చేసేందుకు రూ.1లక్ష డిమాండ్ చేసిన సిఐ



ఫోర్త్ టౌన్ సిఐ మధుసూదన్ గౌడ్

**కర్నూలు క్రైం, మేజర్ న్యూస్ :** కౌంటర్ కేసు నమోదు చేసేందుకు డబ్బు డిమాండ్ చేసిన పోలీసులు ఏసిబికి పట్టుపడ్డారు. 2024లో ముగ్గురు వ్యక్తుల మధ్య జరిగిన ఘర్షణలో రెండు వర్గాలు పరస్పరం పోలీసులకు ఫిర్యాదుచేశాయి. అయితే, ఒకరివైపు ఫిర్యాదు ఆధారంగా హత్యాయత్నం కేసు నమోదు చేసిన పోలీసులు మరో వర్గం ఇచ్చిన ఫిర్యాదునుచెత్తబుట్టలో వేసింది. దీంతో వారు కోర్టును ఆశ్రయించారు.కేసు నమోదు చేయాలంటూ కోర్టు ఆదేశాలిచ్చింది.కోర్టు ఆదేశాలున్నా కేసు నమోదు చేసేందుకు నాల్గవ పట్టణ

మిగతా 2లో



నిర్మల హోటల్



4వ పట్టణ పోలీస్ స్టేషన్



నగదుతో ఏసిబికి పట్టుబడ్డ హెడ్ కానిస్టేబుల్ రవికుమార్

## రేషన్ దుకాణాల ద్వారా సరుకులు పంపిణీ

- పౌర సరఫరాల అధికారి రాజా రఘువీర్
- జిల్లాలో 1233 రేషన్ దుకాణాల్లో రేషన్ పంపిణీ ప్రారంభం
- రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి టీజీ.భరత్, కలెక్టర్ రంజిత్ బాషా

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** జిల్లా వ్యాప్తంగా రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసర సరుకులు పంపిణీ చేసినట్లు జిల్లా పౌర సరఫరాల అధికారి రాజా రఘువీర్ తెలిపారు. నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని మంత్రి టీజీ భరత్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేసినట్లు తెలిపారు. అన్ని నియోజకవర్గాలలో ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యంతో వారి చేతుల మీదుగా రేషన్ షాపుల పునఃప్రారంభోత్సవం చేయడం జరిగిందన్నారు.

మిగతా 2లో



కార్డుదారులకు రేషన్ పంపిణీ చేస్తున్న మంత్రి, కలెక్టర్

## వజ్రం దొరికేనా..!! అదృష్టం వరించేనా..?

**మహానంది, మేజర్‌న్యూస్ :** పేదవాడు కలలు సాకారం చేసుకునేందుకు వజ్రాల వేటలోమునిగితేలుతున్నాడు.తన అదృష్టం వరించి ఒక్క వజ్రం దొరికానా తన జీవితం మారుతుందని కుటుంబం బాగుపడుతుందని

మిగతా 2లో



నదిలోని మట్టిలో వజ్రాల కోసం వెతుకుతున్న మహిళ



నల్లమల అడవి ప్రాంతంలో వజ్రాలను వెతుక్కుంటున్న ప్రజలు

## రైతులను మోసం చేస్తున్న రాగమయూరి కంపెనీ



బాధితులతో మాట్లాడుతున్న నిజనిర్ధారణ కమిటీ సభ్యులు

**కల్లూరు, మేజర్‌న్యూస్ :** ఉలిందకొండ కొల్లంపల్లి, తాండా, ఎరకత్వ గ్రామాల పరిధిలో ప్రజలు సాగు చేసుకుంటున్న వ్యవసాయ భూములను రియల్‌ఎస్టేట్ వ్యాపారి రాగమయూరి కంపెనీకి చెందిన కేజె రెడ్డి రైతులను భయపెట్టి తన అనుచరుల పేరుతో తక్కువ ధరకు రూ.50వేలు చెల్లించి ఎకరానికి రూ.6లక్షలు చెల్లించినట్లు రిజిస్టర్ విక్రయ పత్రాలను సృష్టించినట్లు ప్రజలు ఆదివారం నిజ నిర్ధారణ కమిటీ సభ్యుల దృష్టికి తీసుకెళ్లారు. నిజనిర్ధారణ కమిటీ సభ్యులు బాధితుల పొలాల వద్దకు వెళ్లి వారి సమస్యను తెలుసుకున్నారు.

మిగతా 2లో

సూర్య
సోమవారం | 02 జూన్ 2025

# ఏసీబీ వలలో నాల్గవ పట్టణ సిఐ,హెడ్ కానిస్టేబుల్

(మొదటి పేజీ తరువాయి)

సిఐ మధుసూధన్‌గౌడ్ డబ్బులు డిమాండ్ చేశారు. కోర్టు ఆదేశాలున్నా కేసు నమోదు చేసేందుకు సిఐ డబ్బు డిమాండ్ చేయడంతో ఆ వర్గం అవినీతి నిరోధక శాఖను ఆశ్రయించింది. సిఐ ఆదేశాలతో డబ్బు తీసుకున్న హెడ్ కానిస్టేబుల్, సిఐ ఇద్దరూ చివరకు ఆదివారం ఏసిబికి వలలో పడ్డారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి.

నాలగవ పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో 2024 లో చలపతితో బెస్త రఘు, బెస్త రవికుమార్‌లు గొడవపడ్డారు. ఈ గొడవలో చలపతికి గాయాలు కాగా, రెండు వర్గాలు నాలగవ పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నాయి. చలపతి ఫిర్యాదును పరిగణనలోకి తీసుకున్న పోలీసులు బెస్త రఘు, రవికుమార్‌లపై హత్యా యత్నం కేసు నమోదు చేశారు. వీరి ఫిర్యాదును చెత్తబుట్టలో వేశారు. తమ ఫిర్యాదుపై కేసు నమోదు చేయాలని వీరిద్దరూ కోర్టును ఆశ్రయించగా, కోర్టు వీరికి అనుకూలంగా తీర్పునిచ్చింది. కోర్టు ఆదేశాల మేరకు కేసు నమోదు చేయాల్సిన నాలగవ పట్టణ పోలీసుస్టేషన్ సిఐ మధుసూధన్‌గౌడ్ లక్ష రూపాయలు డిమాండ్ చేశారు. ముందుగా 10వేల రూపాయలు ఇచ్చిన బెస్త రఘు, బెస్త రవికుమార్‌లు లంచావతారం అవినీతి గురించి పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. వారూ ఎలాంటి చర్యలు తీసుకోకపోగా ఏ మాత్రం పట్టించుకున్న పాపాన పోలేదు.


ఏసిబిని ఆశ్రయించిన బాధితులు

దీంతో వీరిద్దరూ అవినీతి నిరోధక శాఖను ఆశ్రయించారు.

ఆదివారం నగరంలోని కొత్త బస్టాండ్ వద్దనున్న ఓ హోటల్ వద్ద ఈ కేసులో నిందితుల వద్ద నుండి రూ.80వేలు లంచం తీసుకుంటున్న హెడ్ కానిస్టేబుల్ రవికుమార్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు ఏసిబి డిఎస్పీ సోమన్న తెలిపారు. ఈ సందర్భంగా ఏసిబి డిఎస్పీ సోమన్న మాట్లాడుతూ 2024లో చలపతి, బెస్త రఘు, బెస్త రవికుమార్ అనే వ్యక్తులు గొడవ పడ్డారని ఈ గొడవలో చలపతి అనే వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా ఆ కేసులో రఘు, రవికుమార్‌లపై హత్యాయత్నం కేసు నమోదైందని తెలిపారు. కోర్టు ఎండార్స్‌మెంట్ హత్యాయత్నం కేసు ఉండగా నింధితులకు 4వ పట్టణ సిఐ మధుసుదన్‌గౌడ్ మీ కేసు విచారణకు వచ్చిందని మీరు రూ.1లక్ష ఇస్తే మీకు శిక్ష పడకుండ చేస్తానని తెలిపారు. ఇందుకు డబ్బులు ఇచ్చేందుకు ఇష్టపడని రఘు, రవికుమార్‌లు రూ.10వేలు మూడురోజుల కిందట ఇచ్చి మిగతా డబ్బులు ఆదివారం ఇస్తామని చెప్పి ఏసిబిని ఆశ్రయించినట్లు తెలిపారు. దీంతో రంగంలోకి దిగిన ఏసిబి వారి పద్ధతిలో రూ.80వేలు ఏసిబి వారి నోట్లను రఘుకు ఇవ్వగా రఘు సిఐకు ఫోన్ చేసి డబ్బులు ఎక్కడ ఇవ్వాలని అడుగగా సిఐ కొత్త బస్టాండ్ ఎదురుగా ఉన్న నిర్మల హోటల్‌కు మా హెడ్ కానిస్టేబుల్ రవికుమార్ వస్తారని అతనికి ఇస్తే మీ కేసు మాఫీచేసేవిధంగామాట్లాడతామని చెప్పారు. వెంటనే హెడ్ కానిస్టేబుల్ రవికుమార్‌కు ఫోన్ చేసి మనకు తెలిసిన వారు రూ.80 వేలు ఇస్తారు అవి తీసుకుని నీ వద్ద పెట్టుకో నేను వచ్చి తీసుకుంటానని సిఐ తెలపడంతో హెడ్ కానిస్టేబుల్ నిర్మల్ హోటల్ వద్దకు వెళ్లాడు. అప్పటికే బాధితులు, ఏసిబి సిబ్బంది హోటల్, పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకున్నారు. బాధితుడు రఘు హెడ్ కానిస్టేబుల్ రవికుమార్‌కు నగదును ఇస్తుండగా ఏసిబి అధికారులు వెంటనే దాడి చేసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సిఐ చెబితేనే వచ్చానని తనకు ఈ డబ్బుతో ఎలాంటి సంబంధం లేదని చెప్పగా హెడ్‌కానిస్టేబుల్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. అనంతరం సిఐ మధుసూదన్ గౌడ్ ఇంటికి వెళ్లి అతనని కూడా స్టేషన్‌కు పిలుచుకుని వచ్చి అదుపులోకి తీసుకున్నట్లు ఏసిబి డిఎస్పీ సోమన్న తెలిపారు. ఏ1గా హెడ్ కానిస్టేబుల్ రవికుమార్ కాగా రెండవ ముద్దాయిగా 4వ పట్టణ సిఐ మధుసూదన్ గౌడ్‌ను పంచనామ, విచారణ అనంతరం ఇద్దరిని రిమాండ్‌కు తరలిస్తామని తెలిపారు.

# రైతులను మోసం చేస్తున్న రాగమయూరి కంపెనీ

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ రాగమయూరి యజమాని కేజె రెడ్డి తన అనుచరుడైన నాగరాజు పేరు మీద రైతులను భయపెట్టి వారికి నామకార్థము ఎకరాకు రూ.50వేలు చెల్లించి లక్షలు విలువ చేసే సారవంతమైన భూములను రిజిస్టర్ కార్యాలయం నందు అధిక విలువలు ఎకరానికి రూ.6లక్షలు చూపించి రిజిస్టర్ చేస్తున్నట్లు నిర్ధారిస్తున్నామన్నారు. తమ పెద్దల కాలం నాటి నుండి సాగు చేసుకుంటున్న భూమిని ఇవ్వడానికి అంగీకరించలేదని నాగన్న, అతని కుమారులు సంజీవ్, విష్ణు, అశోక్‌లపై తప్పుడు కేసులు బనాయించి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. కేజె రెడ్డి మాట విని పోలీసులు నాగన్నను అతని కుమారులను ముగ్గురిని హింసించి వారి చదువులు భంగం చేసి వారి మీద రౌడీషీట్లు ఓపెన్ చేసినారని తెలిపారు. అనంతరం నిజ నిర్ధారణ కమిటీ సభ్యులు ఆర్ రామకుమార్, ప్రధాన కార్యదర్శి, ఓపిడిఆర్ ఏపి పిచ్చుక శ్రీనివాస్, సీనియర్ న్యాయవాది ఎంఆర్ కృష్ణ, బిసి జనసభ శేషఫణి, సమాచార హక్కు ప్రచార రాష్ట్ర కార్యదర్శి ఎన్‌కె జయన్న, ప్రజా పరిరక్షణ సమితి విజయవాడ పర్వతనేని హరికృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డేవిడ్, ఎంకె రాజు తదితరులు మాట్లాడుతూ నాగన్న అతని కుమారులపై పెట్టిన క్రిమినల్ కేసులున రద్దు చేసి వారి ఇంటికి వారు వెళ్లేవిధంగా చర్యలు తీసుకోవాలని, అలాగే ఆ గ్రామాలలో ఉన్న ప్రభుత్వ భూములలో గత 50ఏళ్లుగా సాగు చేసుకుంటున్న రైతులు ఎవరైతే ఉన్నారో వారికి పట్టాలు మంజూరు చేసి వారి పేర్లు వెబ్‌ల్యాండ్ రికార్డులో నమోదు చేసి పట్టాదారు పాస్ పుస్తకాలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

# ఇంటింటి రేషన్ పేరుతో రూ.1600కోట్ల దోపిడి

**– టీడీపీ ఇంఛార్జ్ రాఘవేంద్రరెడ్డి**

**మంత్రాలయం రూరల్, మేజర్ న్యూస్ :**

వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇంటింటికి రేషన్ పేరుతో 1600 కోట్లు దోపిడి చేశారని టీడీపీ ఇంచార్జ్ రాఘవేంద్రరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సుంకేశ్వరి గ్రామంలో ఇంటి వద్ద రేషన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రేషన్‌పంపిణీపై కూటమి ప్రభుత్వ హయాంలో నిఘా వ్యవస్థలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. 15రోజులపాటుగా రేషన్ బియ్యం సప్లై చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు లక్ష్మయ్య, చావిడి వెంకటేష్, రోగప్ప, చంద్ర, తహశీల్దార్ చంద్రశేఖర్, విఆర్ఓ ఆనంద్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వజ్రం దొరికేనా..అదృష్టం వరించేనా..!!

(మొదటి పేజీ తరువాయి)

అనుకుని వ్యయప్రయాసాలతో సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చి తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నాడు వజ్ర వేటగాడు. నంద్యాల, గిద్దలూరు రహదారిలోని సర్వనరసింహ స్వామి ఆలయం వద్ద వర్షాలు కురిసి కాలువల వెంట నీరు ప్రవహిస్తుండటంతో పలువురు ప్రజలు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటూ వజ్రాల వేటను కొనసాగిస్తున్నారు. నంద్యాల, ప్రకాశం, గుంటూరు, తదితర జిల్లాల నుంచి ప్రజలు తరలివస్తూ నల్లమల అడవి నుంచి ప్రవహించే వాగుల వెంట వజ్రాల వేటను కొనసాగిస్తున్నారు. మహానంది, శిరివెళ్ల మండల పరిధిలో వజ్రాల వేట కొనసాగిస్తున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ప్రజలు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటూ కొనసాగిస్తున్న ఈ వజ్రాల వేటలో ఎవరికి ఏమి దొరికాయో తెలీదు కాని ఇంత వరకు నాకు ఖచ్చితంగా ఈ వజ్రం దొరికింది అని చెప్పే నాదుడే లేడు. కొన్ని సంవత్సరాలుగా కాలువలను తవ్వుతున్నారే తప్ప ఒక్కరికీ ఒక్క వజ్రం దొరికిందన్న గ్యారెంటీ లేదు. వారి నోట వీరి నోట అపోహలతో కూడిన మాటలు దుష్ప్రచారం చేస్తున్నాయి. అదిగో పులి ఇదిగో గిలి అన్న సామెత చందంగా ఆ సుబ్బయ్యకు దొరికిందంట ఈ ఎల్లయ్యకు దొరికిందంట ఈ ఎంకమ్మకు దొరికిందంట ఈ పుల్లమ్మకు దొరికిందంట అన్న దుష్ప్రచారాలే తప్ప నాకు దొరికిందని చెప్పేవారే లేరు. వజ్రాల కోసం వెతికే వారికి వజ్రం దొరకడం దేవుడికెరుక కాని చిరువ్యాపారుల వ్యాపారం మాత్రం మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతుందని చర్చించుకుంటున్నారు. గత రెండు సంవత్సరాల క్రితం ఇదే వజ్రాల వేట కోసం వచ్చి ఒక పూరి గుడిసెలో ఉంటూ వజ్రాల వేటను కొనసాగిస్తున్న ఒకరిద్దరు పాము కాటుకు గురయ్యారు. ఏదేమైనా పేదవాడు ఆశాజీవి. పెడతారంటే ఆశ కొడతారంటే భయం అన్న సామెతగా ఒక్క వజ్రమైనా దొరకకపోతుందా అని ఆశతో వేటను కొనసాగిస్తున్నాడు.

# ఉనికి కోల్పోతున్న ఉర్దూ పాఠశాలలు

(మొదటి పేజీ తరువాయి)

ఉర్దూ మాధ్యమ కళాశాలలకు వెళ్తున్నారు. తాలూకాలో మైనార్టీల జనాభా దాదాపు 80 వేలు ఉంది. ఇంతటి భారీ స్థాయిలో మైనార్టీలు ఉన్న ఉర్దూ మాధ్యమంపై ప్రభుత్వం దృష్టి సారించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఆళ్లగడ్డ మండలంలో మూడు ప్రభుత్వ ఉర్దూ పాఠశాలలు, ఒక ఎయిడెడ్ పాఠశాల ఉన్నాయి. పట్టణంలో 15 వేలకు పైగా ముస్లిం జనాభా ఉన్న కేవలం రెండు ఉర్దూ పాఠశాలలే ఉన్నాయి. ఆళ్లగడ్డ పట్టణంలో ప్రాథమికోన్నత పాఠశాల, ఒక ఎయిడెడ్ ఉర్దూ పాఠశాల ఉంది. కోట కందుకూరు, ఓబులంపల్లెలో ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. పట్టణంలోని పాఠశాలలో ఒకటి నుంచి 8వ తరగతి వరకు 72 మంది విద్యార్థులు చదువుతున్నారు. అందరికీ కలిపి కేవలం రెండు గదులు మాత్రమే ఉన్నాయి. ఒక్క గదిలో రెండు తరగతులను నిర్వహించి మిగిలిన వారిని వరండాలో కూర్చోబెట్టి బోధిస్తున్నారు. పాఠశాలకు ప్రహరీ గోడ లేకపోవడంతో కుక్కలు, పందులు ఆవరణలోనే తిరుగుతుండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఉర్దూ పాఠశాల 8వ తరగతి వరకు ఉండగా మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల అని రాయాల్సి ఉండగా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పేరు ఇప్పటికీ ఉండడం ఉపాధ్యాయుల నిర్లక్ష్యానికి ఒక నిదర్శనం. పట్టణంలోని మగ్దుమ్ ఎయిడెడ్ ఉర్దూ పాఠశాలలో ఇద్దరు విద్యార్థులు మాత్రమే ఉన్నారు. కాగా పట్టణంలో 8వ తరగతి వరకే ఉర్దూ పాఠశాల ఉండడంతో 9,10వ తరగతి చదవడానికి కొంతమంది విద్యార్థులు సిరివెళ్ల, ఇతర ప్రాంతాలకు వెళ్తున్నారు. మరికొందరు గత్యంతరం లేక పాఠశాలను మాన్పించేసి కూలి పనులకు పంపిస్తున్నారు. పట్టణంలో ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలను ఉన్నత పాఠశాల గా మార్చాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. మండలంలోని ఓబులంపల్లె గ్రామంలో 60 శాతం ముస్లిం జనాభా ఉన్నప్పటికీ ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో కేవలం ఇద్దరు విద్యార్థులే ఉన్నారు. పాఠశాలలో మౌలిక సదుపాయాలు లేకపోవడం, ఉపాధ్యాయులు విద్యార్థుల సంఖ్య పెంపునకు దృష్టి సారించకపోవడం, దీనికి తోడు పాఠశాల పరిసరాలను సవ్యంగా ఉంచడం పై దృష్టి సారించకపోవడంతో ఏడాదికేడాది విద్యార్థుల సంఖ్య తగ్గుతుంది. గతంలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండగా ప్రస్తుతంకేవలం ఒక్కరే బోధిస్తున్నారు. ఉపాధ్యాయురాలు, మండల విద్యాశాఖాధికారి, గ్రామ పెద్దలు పాఠశాలపై దృష్టి సారించి విద్యార్థినిలను పాఠశాలలో చేర్పించేందుకు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆళ్లగడ్డ మండలం కోట కందుకూరు లోని ఉర్దూ పాఠశాల శిథిలావస్థకు చేరడంతో దాని పక్కనే అదనపు గది నిర్మించారు. పాత పాఠశాలలోని రెండు గదుల్లోనే తరగతులను బోధిస్తున్నారు. కొత్త ఆదనపు తరగతి గదిలో ఒక గదిలో విద్యార్థులను బోధిస్తుండగా, మరొక గదిలో ఇటుకలు, సిమెంట్ బస్తాలు, ఇతర సామాన్లు పెట్టారు. ఈ పాఠశాలకు కూడా ప్రహరీ గోడ కూడా లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. చాగలమర్రి మండల కేంద్రంలో ప్రాథమికోన్నత, ప్రాథమిక ఉర్దూ పాఠశాలలు ఉన్నాయి. ముస్లిం జనాభా ఎక్కువగా ఉన్న పెద్ద వంగలి గ్రామంలో ఉర్దూ పాఠశాల ఏర్పాటు చేయకుండా అక్కడ ఉన్న ప్రభుత్వ పాఠశాలలో ఒక ఉర్దూ పోస్టు మాత్రమే కేటాయించి చేతులు దులుపుకున్నారు. సిరివెళ్ల మండల కేంద్రంలో ఉర్దూ బాలుర, ఉర్దూ బాలికల పాఠశాలలు ఉన్నాయి. అలాగే ఒక ఎయిడెడ్ ఉర్దూ పాఠశాల ఉంది. మండలంలోని యర్రగుంట్ల, బోయలకుంట్లలో ఉర్దూ పాఠశాలలు ఉన్నాయి. మైనార్టీల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రధానమంత్రి జన వికాస్ కార్యక్రమం కింద మైనార్టీలు ఎక్కువగా ఉన్న ఆరు మండలాలకు నిధులు కేటాయించగా అందులో రెండు మండలాలు అనగా చాగలమర్రి, సిరివెళ్ల మండలాలు ఆళ్లగడ్డ నియోజకవర్గంలోనే ఉన్నాయి. చాగలమర్రి మండలం పెద్ద వంగలి గ్రామంలో చేపట్టిన ఐటిఐ కళాశాల నిర్మాణం అసంపూర్తిగా ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆళ్లగడ్డ పట్టణంలో ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలను అప్‌గ్రేడ్ చేసి ఉన్నత పాఠశాలగా మార్చాలి. అలాగే నియోజకవర్గంలో ఉర్దూ కళాశాలను ఏర్పాటు చేయడంతో పాటు ఉర్దూ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలనిపలువురుకోరుతున్నారు.


ఎంఈఓ శోభా వివేకవతి

**ఉర్దూ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించండి:** రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గంలోని ఉర్దూ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని తాలూకా ఆవాజ్ కమిటీ కార్యదర్శి ఇస్మాయిల్ బేగ్ అన్నారు. నియోజకవర్గంలో ఉర్దూ కళాశాలను ఏర్పాటు చేయాలన్నారు. ఆళ్లగడ్డ పట్టణంలో 8వ తరగతి వరకు ప్రాథమికోన్నత పాఠశాల ఉందన్నారు. ప్రస్తుతం ఉన్న పాఠశాలను అప్‌గ్రేడ్ చేసి పదవ తరగతి వరకు ఏర్పాటు చేయడంతో పాటు అదనపు గదులను నిర్మించాలన్నారు. నియోజకవర్గంలో ఉపాధ్యాయుల కొరత లేకుండా చేయాలన్నారు.


ఇస్మాయిల్ బేగ్.. ఆవాజ్ కమిటీ తాలూకా కార్యదర్శి

**ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తాం:** పట్టణంలోని పాత మసీదు సమీపంలో ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలఉందని9,10తరగతులు నడపడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామని ఎంఈఓ శోభ వివేకవతి తెలిపారు. ముస్లింల జనాభా ఎక్కువగా ఉన్న ఓబులంపల్లె ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు తక్కువగా ఉన్నారని అక్కడ విద్యార్థులను పెంచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే ఉర్దూ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

## ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా కబీర్‌సాబ్ బాధ్యతలు


ప్రధానోపాధ్యాయుడు కబీర్‌సాబ్‌ను సత్కరిస్తున్న దృశ్యం

**హొళగుంద,మేజర్‌న్యూస్‌:** హొళగుంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా కబీర్‌సాబ్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు.ఆలూరు మండలం ఆరికెర ప్రభుత్వ పాఠశాల నుండి బదిలీపై ఆయన హొళగుంద ఉన్నత పాఠశాలకు వచ్చారు.ఆయనకు కమిటి ఛైర్మన్ ద్వారకనాథ్,సభ్యులు,ఉపాధ్యాయులు, సన్నిహితులు,ఇతరులు పూలమాలతో సత్కరించారు. కబీర్‌సాబ్ స్థానికుడు కావడంతో ఆయనను పలువురు కలిసి స్వాగతించారు.ఉన్నత పాఠశాలలో నాలుగు మీడియం కలిగి ఉండడంతో దాదపు 1800పైబడి విద్యార్థులు ఉన్నత పాఠశాలలో చదువుకుంటారని విద్యార్థులకు మంచి బోధనను అందించడానికి తమవంతుగా కృషి చేయాలని కోరారు.ఈ సందర్భంగా కబీర్‌సాబ్ మాట్లాడుతు విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని విద్యాను ప్రోత్సాహిస్తు మంచి బోధనను అందించడానికి కృషి చేస్తానని, విద్యాభివృద్ధికి పాటు పడుతానని చెప్పారు.గ్రామంలో విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు ప్రతి ఒక్కరు సహకారం అందించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో వలి,సాయిబేస్ పాల్గోన్నారు.

## యాదవ సంఘ సభ్యులందరూ ఐకమత్యంగా ఉండాలి


సన్మానం చేస్తున్న దృశ్యం

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** యాదవ సంఘ సభ్యులందరూ ఐక్యమత్యంగా ఉండి సంక్షేమ పథకాలు అభివృద్ధి చేసుకునేందుకు కృషి చేస్తామని యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కుర్ర శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి వెంకటయ్య లు అన్నారు. ఉయ్యాలవాడ మండలంలోని ఆర్ పాపం పల్లె గ్రామంలో ఆదివారం యాదవ సంఘం సమావేశం ఆళ్లగడ్డ తాలూకా యాదవ సంఘం అధ్యక్షులు బండారు విజయభాస్కరరావు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న రాష్ట్ర యాదవ సంఘం అధ్యక్షులు కుర్ర శ్రీనివాసులు, రాష్ట్ర యాదవ సంఘం ప్రధాన కార్యదర్శి ఓ వెంకటయ్య లు మాట్లాడుతూ యాదవులం అందరం కలిసికట్టుగా ఉండి యాదవ సంఘం అభివృద్ధికి పాటుపడాలన్నారు. అనంతరం పాపం పల్లె గ్రామ యాదవ సంఘం కమిటీ అధ్యక్షునిగా ఇంటి వెంకట సుబ్బయ్య యాదవ్ ను ప్రకటించడం జరిగింది. అలాగే సంఘ సభ్యులుగా గంట వెంకట నరసయ్యను రాష్ట్ర సంఘం ప్రకటించడం జరిగినది. ఈ సందర్భంగా తాలూకా అధ్యక్షులు భాస్కర్ యాదవ్ మాట్లాడుతూ త్వరలో ఆళ్లగడ్డ నియోజకవర్గం లోని అన్ని మండలాలు అన్ని పంచాయతీల వారీగా కమిటీ ఏర్పాటు చేస్తామన్నారు.

## పిఆర్‌టియూ ఆధ్వర్యంలో డిఎస్‌సి 2025 మోడల్ టెస్



**బనగానపల్లె,మేజర్ న్యూస్ :** బనగానపల్లెలో పిఆర్‌టియూ ఆధ్వర్యంలో ఆదివారం డిఎస్‌సి 2025 మోడల్ టెస్ట్ ను నిర్వహించినట్లు పిఆర్‌టియూ మండల అధ్యక్షులు డి. దస్తగిరి తెలిపారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల నిర్వహణలో సందర్భంగా పరీక్ష పత్రాలను ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ, పిఆర్‌టియూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామ పుల్లారెడ్డి మరియు మండల అధ్యక్షుడు దస్తగిరిల పర్యవేక్షణలో నిర్వహించినట్లు తెలిపారు. ఈ పరీక్షను బనగానపల్లె లో దాదాపుగా 40 మంది విద్యార్థులు హాజరై పరీక్షలు రాశారని వారుతెలిపారు. ఈ కార్యక్రమలో పిఆర్‌టియూ జిల్లా నాయకులు కె. హుసైన్ వలి, మండల ప్రధాన కార్యదర్శి అబ్దుల్ షరీఫ్,సీనియర్ పిఆర్‌టియూ నాయకులు సుబ్రహ్మణ్యం, లక్ష్మినారాయణ రెడ్డి, రఫీ లు పాల్గొన్నారు.

## ఈత పోటీల్లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ



పతకాలు సాధించిన క్రీడాకారులు

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** 11వ సీనియర్ అంతర్ జిల్లా ఈత పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించి పతకాలను సాధించారని కోచ్ నటరాజరావు అన్నారు. ఈ సందర్భంగా కోచ్ నటరాజరావు వివరాలు వెల్లడిస్తూ పల్నాడు జిల్లా నరసరావు పేటలో నిర్వహించిన 11వ సీనియర్ అంతర్ జిల్లా ఈత పోటీల్లో వెంకటేష్ 50మీటర్స్ బ్యాక్ స్ట్రోక్‌లో, 50 ఫ్రీ స్టయిల్ గోల్డ్ 100బ్యాక్ స్ట్రోక్ గోల్డ్ పతకం, 50ఫ్లై సిల్వర్, సామ్యతంజిన్, 50,100మీటర్ల బటర్ఫ్లై, సిల్వర్ మెడల్, 200వ్యక్తిగత విభాగంలో సిల్వర్ మెడల్, సిల్వర్ 50మీటర్స్ ఫ్ర స్టైల్ సిల్వర్, 200 ఫ్రీ స్టైల్ గోల్డ్ మెడల్, పి హేమలత 800 ఫ్రీ స్టైల్ గోల్డ్, 100మీటర్స్ బ్రెస్ట్ స్ట్రోక్ సిల్వర్, 200బ్యాక్ స్ట్రోక్‌లో సిల్వర్ మెడల్, హేమంత్ 100మీటర్స్ బ్యాక్ స్ట్రోక్ బ్రాంజ్ మెడల్‌ను సాధించారని తెలిపారు. పల్నాడు జిల్లా కార్యదర్శి సుబ్బారెడ్డి విజేతలకు, టీం మెంబర్స్‌కు మెడల్స్‌తో పాటు సర్టిఫికేట్స్ ప్రధానం చేసి వారిని అభినందించారు. జిల్లాకు చెందిన క్రీడాకారులు ఉత్తమ ప్రదర్శన చేసి పతకాలు సాధించిన క్రీడాకారులను కర్నూలు స్విమ్మింగ్ కోచ్ నటరాజ్ రావు, ఆక్వాటిక్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నరసింహచారి, రాము యాదవ్, ట్రెజరర్ దస్తగిరి, జిల్లా సహాయ కార్యదర్శి రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు శివరాజ్, వెంకటేశ్వర్లు, రవి, అగ్రజతయ్య, రాఘవేంద్ర, శివ తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు రేషన్ బియ్యం సక్రమంగా పంపిణీ చేయండి



రేషన్ బియ్యం పంపిణీ చేసిన టిడిపి నాయకులు

**చాగలమర్రి , మేజర్ న్యూస్ :** పేదలకు రేషన్ బియ్యం సక్రమంగా విమర్శలకు తావు లేకుండా అందించాలని టిడిపి రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు అన్సర్‌భాష రేషన్ డీలర్లకు తెలిపారు. చాగలమర్రి పట్టణంలోని పాత బస్టాండుకు సమీపంలోగల డీలర్ బాస్కర్‌కు చెందిన 9 వ దుకాణంలో రేషన్ పంపిణీని ప్రారంభించి ప్రజలకు సరకులను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ఎండియు వ్యవస్థను తీసుకువచ్చి ప్రభుత్వానికి ఎంతో నష్టం కలిగించారని ఎండియు వాహనాలు ఇంటికి పోకుండా వీధిలో ఒక చోట ఇవ్వడం జరిగిందని, వాహనం ఎప్పుడొస్తుందో తెలియక కార్డుదారులు ఇబ్బంది పడేవారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలు తమకు వీలైన సమయంలో ఏ స్టోర్ వద్ద అయినా 1 తేదీ నుంచి 15వ తేదీ వరకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలకు మరియు సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు సరుకులు సులువుగా సరైన తూకం తో తీసుకోవచ్చు అన్నారు .అదేవిధంగా 65 సంవత్సరాల పైబడిన వృద్ధులకు వికలాంగులకు ఎటువంటి ఆటంకం కలుగకుండా ఇంటి వద్దకే సరుకులు పంపిణీ చేస్తారన్నారు. మండలంలోని గ్రామాల్లో చౌక దుకాణం లలో రేషన్ బియ్యాన్ని అట్టహాసంగా పంపిణీ చేశారు. అనంతరం చాగలమర్రి పట్టణంలోని లోని డీలర్లు అన్సర్‌బాషా ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కొలిమి హుసేన్‌వళి,కొలిమి షరీఫ్,ఆలంసాగారి హనీఫ్, గుత్తి నరసింహులు,వేణుగోపాలరెడ్డి,సుబ్బారావు,భాస్కర్‌రెడ్డి, రఫియుద్దీన్,రమేష్,కసినేని ఓబులేసు, మాబులాల్,గంగుల బాస్కర్, డీలర్లు పాల్గొన్నారు.

## పదిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు అభినందన


విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** 2025 వ సంవత్సరం పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో అత్యుత్తమంగా మార్కులు సాధించిన విశ్వశాంతి పాఠశాల విద్యార్థులను ట్రెండ్స్ ఆధ్వర్యంలో మెడల్స్, సర్టిఫికెట్లతో, జ్ఞాపకలతో సత్కరించారు. ఆళ్లగడ్డ పట్టణంలోని విశ్రాంతి భవనం ఎదురుగా ఉన్న ట్రెండ్స్ వద్ద ఆదివారం పదవ తరగతి పరీక్షల్లో ప్రభంజనం సృష్టించిన విశ్వశాంతి పాఠశాల విద్యార్థులు ఏ మహమ్మద్ ఆదిల్ 596, డి భరత్ కుమార్ రెడ్డి 587, ఏ శ్రీ నయని 584,పిఅనూష582, ఏ భవాని 578, ఇవి దివ్యశ్రీ 574, డి ఆసిఫ్ 570 మార్కులతో సాధించిన విద్యార్థులకు కేక్ కట్ చేసి అభినందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆళ్లగడ్డ నియోజకవర్గం ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం అపుస్మ అధ్యక్షులు టి.అమీర్ భాష విచ్చేసి మాట్లాడుతూ ఎస్ ఎస్ సి 2025 సంవత్సరం పరీక్షల ఫలితాల్లో ఉన్నతశ్రేణిలో రాణించిన విశ్వశాంతిహై స్కూల్ విద్యార్థులు ఆళ్లగడ్డను చదువుల గడ్డగా స్ఫూర్తిగా నిలబెట్టి తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు తమ ఊరికి మంచి పేరు తీసుకుని వచ్చారని అభినందిస్తూ ప్రత్యేకంగా తల్లిదండ్రులను అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, విజయ్ పాల్గొన్నారు.

## అమ్మాయిలు తమను తాము రక్షించుకోవడానికి కరాటే అవసరం


విద్యార్థులతో సిఐ ఇంతియాజ్‌భాష, కరాటే మాస్టర్లు

**డోన్, మేజర్‌న్యూస్‌:** ప్రస్తుత సమాజంలో ఆడపిల్లలు, అమ్మాయిలు, మహిళలపై జరుగుతున్న దాడులను దృష్టిలో ఉంచుకొని అమ్మాయిలు తమను తాము రక్షించుకోవడానికి, ఆకతాయిల ఆట కట్టించేందుకు తప్పనిసరిగా ఆడపిల్లలు చిన్నతనం నుండి కరాటేను నేర్చుకోవాలని డోన్ అర్బన్ సిఐ ఇంతియాజ్‌భాష అన్నారు. ఆదివారం పట్టణంలోని నెహ్రూనగర్‌లో గల అక్షర స్కూల్ ఆవరణలో సికోకై కరాటే ఇంటర్నేషనల్ ఇండియా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి కర్నూలు జిల్లా కరాటే అసోసియేషన్ అధ్యక్షులు చంద్రశేఖర్ ఎగ్జామినర్‌గా విద్యార్థులకు బెల్ట్ గ్రేడింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రాజేష్‌సింగ్, నిఖిల్‌లు బ్లాక్ బెల్ట్, అభిరామ్ బ్రౌన్, అసిఫా, సాయికీర్తన, అభినయబాయి, లౌక్యరెడ్డి బ్లూ, భానుప్రకాష్, సాయిచరణ్ పర్పుల్, ఆశ్వర్ధరెడ్డి గ్రీన్, వేదాన్ష్, చక్రధర్ ఆరెంజ్, మెహజబీన్, మహాలక్ష్మి, హన్సినీ, హేమంత్, షరీఫ్, విశ్వలె ఎల్లో బెల్టులు సాధించారని కరాటే మాస్టర్ రమణ తెలిపారు. బెల్టులు సాధించిన విజేతలకు ముఖ్య అతిథిగా హాజరైన డోన్ అర్బన్ సిఐ ఇంతియాజ్‌భాష చేతులమీదుగా బెల్ట్‌లు, ప్రశంస పత్రాలనుఅందించారు.సీనియర్ స్టూడెంట్స్ శ్రీనిత్య, బాలాజీ, జగన్, జయంత్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## టీబీ వ్యాధి నియంత్రణకు స్పెషల్ డ్రైవ్

**గోనెగండ్ల,మేజర్‌న్యూస్ :** గ్రామాలలో టీబీ(క్షయ) వ్యాధి నియంత్రణకు ప్రభుత్వం టీబీ ముక్తభారత్ అబియాన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని సోమవారం నుంచి ప్రతి గ్రామ సచివాలయంలో ఏర్పటు చేస్తున్నట్లు డివిజన్ టీబీ సూపర్ వైజర్ వేణుగోపాలచారి తెలిపారు. ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం టీబీ వ్యాధి గ్రస్తులను గుర్తించి వారికి వైద్యసేవలు అం దించేందుకు గాను ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందన్నారు. ఈ కార్యక్రమం 100 రోజుల పాటు ప్రతి గ్రామంలోని సచివాలయంలో జరుగుతుందన్నారు. ఆ సచివాలయ పరిధిలోని 60 ఏళ్లు పైబడిన వారికిబీపీ, సుగర్, ఆయాసం, దగ్గు లక్షణాలు ఉన్న వారికి గళ్ల పరీక్షలు చేసి వ్యాధి నిర్ధారణ అయితే ఆరోగికి ఆరు నెలలు ఉచితంగా మందులు అందజేస్తారన్నారు. అలాగే పోషకాహారం కోసం ప్రభుత్వం నెలకురూ.1000 చెల్లిస్తుందన్నారు. టీబీ(క్షయ) వ్యాధి అంటువ్యాధి కావడంతో రోగుల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. సోమవారం హెచ్ కైరవాడి, మంగళవారం కున్నూరు, బుధవారం ఐరన్బండ, శుక్రవారం పుట్టపాశం గ్రామాలతో పాటు పలు గ్రామాలలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. కావున ఆనారోగ్యంతో ఉన్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## బైక్ అదుపుతప్పి కిందపడ్డ వ్యక్తికి తీవ్రగాయాలు


గాయపడిన కుమారస్వామి

**వెల్దుర్తి, మేజర్‌న్యూస్‌:** 44వ నెంబర్ జాతీయ రహదారిపై బైక్ నడుపుతూ అదుపుతప్పి కిందపడిన తీవ్ర గాయాలైన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. వివరాలలోకి వెళితే కల్లూరు మండలం, సి క్యాంపు, శ్రీరామ్‌నగర్‌కు చెందిన వ్యక్తి కర్నూలు ఈనాడు కార్యాలయంలో ఉద్యోగి చల్లా కుమారస్వామి అని సమాచారం తెలిసింది. మధ్యాహ్నం బైక్ అదుపుతప్పిన సంఘటనపై హైవే పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు కుమారస్వామి బైక్‌పై కర్నూలు నుండి డోన్ వైపు 44వ నెంబర్ జాతీయ రహదారిపై వెళ్తున్నాడు. మార్గమధ్యలో వెల్దుర్తి హైవే పెట్రోల్ బంక్ ఎదురుగా గల లిమ్రాస్ హోటల్ వద్ద ఎదురుగా పక్కపక్కనే వెళ్తున్న లారీ, కారులను ఓవర్‌టేక్ చేసేందుకు వాటి మధ్యలో బైక్‌ను తీసుకెళ్ళినట్లు సమాచారం. ఆ సమయంలో బైక్ అదుపు తప్పిందని స్థానికుల సమాచారం. కుమారస్వామి సైతం బైక్‌పై నుండి కిందపడటంతో పక్కనే వెళ్తున్న కార్ డ్రైవర్ అప్రమత్తతో కుమారస్వామిని కారు ఢీ కొనకుండా తప్పించాడు. కిందపడ్డ కుమారస్వామి తలకు తీవ్ర గాయాలైయ్యాయి. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న 108 వాహనం, విషయం తెలుసుకున్న హైవే పెట్రోలింగ్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు.

సూర్య www.suryaa.com



# భూటకపు హామీలతో అధికారంలోకి వచ్చారు

**ఏడాది కావస్తున్న ఒక్క హామిని నెరవేర్చకపోవడం సిగ్గుచేటు**
**పత్తికొండ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ**



పోస్టర్లను విడుదల చేస్తున్న కంగాటి శ్రీదేవమ్మ, నియోజకవర్గ వైకాపా నేతలు

**వెల్దుర్తిరూరల్, మేజర్‌న్యూస్‌ః** 2024 సార్వత్రిక ఎన్నికలలో కేవలంర గద్దెనెక్కడం కొరకు మాత్రమే రాష్ట్ర ప్రజలకు బూటకపు హామిలిచ్చి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్న నేటికి ప్రజలకు ఇచ్చిన హమీలలో ఏ ఒక్కటి కూడా అమలు చేయకపోవడం కూటమి ప్రభుత్వ చేతగానితనమేనని పత్తికొండ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ అన్నారు. మండల పరిధిలోని చెరుకులపాడు గ్రామంలో కంగాటి శ్రీదేవమ్మ స్వగృహంలో ఆదివారం నేటి దినపత్రిక సూర్యతో మాట్లాడుతూ వైయస్ఆర్‌సిపి అధ్యక్షులు వైయస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈనెల 4వ తేదిన పత్తికొండలో జరగబోయే వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర వైకాపా కార్యదర్శి చెరుకులపాడు ప్రదీప్‌కుమార్‌రెడ్డి పత్తికొండ నియోజకవర్గం వైకాపా నాయకులతో కలిసి వెన్నుపోటు దినం పోస్టర్‌ను విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం అవుతున్న, ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. విద్యార్థులను, మహిళలను, రైతులను అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన ఈ కూటమి ప్రభుత్వాన్ని నిలదీద్దామన్నారు. ఈనెల 4వ తేదిన జరగబోయే వెన్నుపోటు నిరసన కార్యక్రమానికి నియోజకవర్గంలోని ప్రతి మండలం నుండి వైకాపా నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో క్రిష్ణగిరి మండల ఎంపిపి డాక్టర్ కె.వెంకటరామిరెడ్డి, వెల్దుర్తి మండల వైకాపా అధ్యక్షులు బొమ్మన రవీంద్రనాథ్‌రెడ్డి, నర్సింగ్ అశోక్‌కుమార్‌రెడ్డి, పుల్లగుమ్మి ఎంపిటిసి నాగార్జునరెడ్డి, బుక్కాపురం శంకర్‌రెడ్డి, రత్నపల్లి రమణారెడ్డి, క్రిష్ణగిరి మండల వైకాపా నాయకులు, పత్తికొండ నియోజకవర్గం వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రేషన్ బియ్యంను ప్రజలకు సక్రమంగా పంపిణీ చేయాలి

**గోనెగండ్ల, మేజర్‌న్యూస్ :** ప్రభుత్వం ఇటీవల రేషన్ దుఖాణాల దగ్గరనే రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని జూన్ 1వ తేది నుంచి ప్రారంభించిందని రేషన్ డీలర్లు సక్రమంగా ప్రజలకు రేషన ను పంపిణీ చేసేందుకు కృషి చేయాలని మండల టీడీపీ నాయకులు తిరుపతయ్యనాయుడు, మాజీ సాగు నీటిసంఘం అధ్యక్షుడు దరగలమాబు, మాజీ సర్పంచ్ రంగముని, అడ్వకేట్ చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన గోనెగండ్లలోని ఐదవ రేషన్ షాప్ దగ్గర రేషన్ ను పంపిణీ కార్యక్రమాన్ని టీడీపీ నాయకులు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఎండీయూ వాహనా ల ద్వార రేషన్ సరుకుల పంపిణీని రద్దు చేసిందన్నారు. అందుచేత ప్రజలకు రేషన్ దుఖానాల దగ్గరనే రేషన్ పంపిణీ చేస్తుందని తెలిపారు. ప్రతి నెల 1వ తేది నుంచి 15 వ తేది వరకు రేషన్ పంపిణీ జరుగుతుందని అలాగే 5వ తేదీ లోపు 65ఏళ్లు దాటిన వృద్ధులకు, వికలాంగులకు ఇంటి దగ్గరకే రేషన్ అందించే అవకాశాన్ని



గోనెగండ్లలో రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

ప్రభుత్వం ఏర్పాటు చేసిందని వృద్ధులు ఇబ్బంది పడాల్సిన అవసరం లేదన్నారుఉ. ఎలాంటి అవినీతి కి పాల్పడకుండా ప్రజలకు రేషన్ అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీలర్ ఫకృద్దీన్, టయోటా ఉసేని, నాయక్ షాషావలి, మందకల్లు టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# రేషన్ దుకాణాల ద్వారా ప్రజలకు నిత్యవసర వస్తువులు

**మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ**

**డోన్, మేజర్‌న్యూస్‌ః** రాష్ట్ర ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా ప్రజలకు నిత్యవసర సరుకులను సరఫరా చేయడం జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ అన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని పాతపేట నందు రేషన్ షాపు ద్వారా రేషన్ సరుకులను ప్రజలకు పంపిణీ చేసే కార్యక్రమాన్ని ఆదివారం మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ చేతుల మీదుగా ప్రారంభించారు.



రేషన్ బియ్యాన్ని ప్రజలకు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ

అనంతరం కోట్ల సుజాతమ్మ మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అవసరమయ్యే రేషన్ సరుకులు అందుబాటులోకి రావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ప్రభుత్వం చేపట్టిన ఈ ప్రక్రియ ప్రజలకు ఉపశమనం కలిగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తహశిల్దార్ నాగమణి, డోన్ మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికే హరికిషన్, నాయకులు సుదీష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గురురాజాలో ముగిసిన సమ్మర్ క్యాంప్

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :**

నంద్యాల పట్టణంలోని ఎన్‌జిఓ కాలనీలో శ్రీగురురాజ ఇంగ్లీష్ మీడియం పాఠశాల ఓపెన్ ఆడిటోరియంలో గురురాజా సమ్మర్ సింపోని-2025 ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు డైరెక్టర్ షేక్షావలిరెడ్డి తెలిపారు. ముగింపు వేడుకలుకు ముఖ్య అతిధులుగా గురురాఘవేంద్ర విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ దస్తగిరిరెడ్డి, డైరెక్టర్ మౌలాలిరెడ్డిలు పాల్గొన్నారు. 8 సంవత్సరాల నుంచి విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభాశక్తిని సృజనాత్మకతను వెలికితీయాలని ఉద్దేశంతో లలితకళలో అనుభవం ఉన్న ఉపాధ్యాయులచే మే 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ఒక మాసం పాటు వారి అభిరుచికి తగిన చెస్, కరాటే, చిత్రలేఖనం, కాలిగ్రఫీ, ఆర్ట్‌అండ్ క్రాఫ్ట్, కమ్యూనికేషన్ స్కిల్స్, తదితర అంశాలలో విద్యార్థులను మమేకం చేశారు. ఈ ముగింపు వేడుకలలో విద్యార్థుల శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు కిండర్ గార్డెన్ చిన్నారుల ఆధునిక నృత్య ప్రదర్శనలు కరాటే అందరిని అబ్బురపరిచాయి. ఈసమ్మర్ క్యాంప్‌లో విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు.






మాట్లాడుతున్న గురు రాఘవేంద్ర విద్యాసంస్థల చైర్మన్ దస్తగిరిరెడ్డి, చిన్నారుల నృత్య ప్రదర్శనలు

## రేషన్ దుకాణాలను ప్రారంభించిన అధికారులు

**సి.బెళగల్ మేజర్ న్యూస్ :** సి.బెళగల్ మండలంలో ఆదివారం రేషన్ దుకాణలను అధికారులు ప్రారభించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరా శాఖ ఒక్క కీలక నిర్ణయం తీసుకుంది. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన రేషన్ వాహనాలను రద్దు చేసింది. ప్రజలకు రేషన్ అందించేందుకు రేషన్ డీలర్లకు అప్పగించింది. అందులో భాగంగా ఆదివారం ఒకటో తారీకు కావడంతో జూన్ నెలకు సంబందించిన రేషన్ బియ్యం అందించేందుకు అధికారులు ముందస్తు చర్యలు తీసుకొని రేషన్ పంపిణిలో అవంతరాలు ఏర్పడకుండా తగు జాగ్రలు సూచింది. ఆదివారం ఉదయం ఆరుగంటలకురేషన్ దుకాణాలనుఅధికారులు ప్రజా ప్రతినిధుల సమక్షంలో ప్రారంభించారు.



# రేషన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే భూమా



రేషన్ సరుకులు అందజేస్తున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** పట్టణంలోని కొత్త మసీదు సమీపంలో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఆదివారం రేషన్ పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలువైసీపీ ప్రభుత్వంలో రేషన్ పంపిణీ కోసం అని ఏర్పాటు చేసిన వెహికల్, డ్రైవర్ అనవసర ఖర్చులను ప్రజలపై మోపాడని, రేషన్ ఎప్పుడు వేస్తారో తెలియని స్థితిలో ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలందరూ ఇబ్బందులు పడకుండా నెలలో 15 రోజులపాటు రేషన్ పంపిణీ చేయాలని తీసుకున్న నిర్ణయానికి ప్రజలందరూ సంతోషపడుతున్నారన్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు, సాయంత్రం 4 నుండి 8 వరకు రేషన్ షాప్ డీలర్లు అందుబాటులో ఉంటారన్నారు. 65 సంవత్సరాలు వయసు దాటిన వారికి, వికలాంగులకు ఇంటి వద్దకే వెళ్లి రేషన్ పంపిని చేస్తారని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ జ్యోతి రత్నకుమారి, సి ఎస్ డి టి సోమశేఖర్ రెడ్డి, కౌన్సిలర్ హుస్సేన్ భాష, ఎయిర్టెల్ శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రేషన్‌షాపుల ద్వారా నాణ్యమైన నిత్యవసర సరుకులు

**డోన్ ఆర్‌డిఓ నరసింహులు**

**డోన్, మేజర్‌న్యూస్‌ః** నాణ్యమైన నిత్యవసర సరుకులను ప్రజలకు సరఫరా చేయాలనే ముఖ్య ఉద్దేశ్యంతో ఆదివారం నుండి రేషన్ దుకాణాల ద్వారా రేషన్ సరుకులను ప్రజలకు పంపిణీ చేయడం జరుగుతుందని డోన్ ఆర్‌డిఓ నరసింహులు, తహశిల్దార్ నాగమణిలు అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం పట్టణంలోని ఇందిరానగర్‌లోని రేషన్ దుకాణం ద్వారా ప్రజలకు రేషన్ బియ్యాన్ని పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



రేషన్ బియ్యాన్ని ప్రజలకు అందిస్తున్న అధికారులు

# శ్రీ చౌడేశ్వరి అమ్మవారి ఆలయ అభివృద్ధికి విరాళం



విరాళం అందజేస్తున్న దృశ్యం

**బనగానపల్లె, మేజర్ న్యూస్ :** శ్రీ చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానం నందు నందవరం గ్రామ వాస్తవ్యులు కీ.శే. సన్నల సోమశేఖర్ రెడ్డి జ్ఞాపకార్థం వారి ధర్మపత్ని సన్నల లక్ష్మీదేవి, కుమారుడు వేణు సాయినాథ రెడ్డి వారి కుటుంబ సభ్యులు ఆలయ అభివృద్ధి కొరకు 25,116/- రూ చందాను డెవలప్ మెంట్ కమిటీ చైర్మన్ పి.వి. కుమార్ రెడ్డి సమక్షంలో ఆలయ అర్చక పండితులకు అందచేశారు. ఆలయ అర్చకులు దాతలను ఆలయ మర్యాదలతో సత్కరించి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

# గ్రామీణ ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**గోనెగండ్ల,మేజర్‌న్యూస్ :** ఇటీవల పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల గ్రామీణా ప్రాంతాలలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలనిగోనెగండ్ల సీఐవిజయభాస్కర్ అన్నారు. చిన్నమరివీడు గ్రామంలో రాత్రి బస కార్యక్రవం చేపట్టారు. ప్రజలతో పోలీసు చట్టాలు, కోర్టు న్యాయం పట్ల అవగహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగితెలుసుకున్నారు. సీఐ మాట్లాడుతూ గ్రామాలలో కొంతమంది ఘర్షణలు లేపేందుకు చూస్తేంటారు వారి మాటలు నమ్మరాదన్నారు. గ్రామాలాలో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతూ ఉంటే వాటిని మా దృష్టికి తీసుకురావాలన్ని గ్రామాలస్థుల కు సూచించారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు అడ్రస్ గోప్యంగా ఉంచుతామన్నరు. ద్విచక్రవాహనాలలో ప్రయాణించే సమ యంలో తప్పక రోడ్డు జాగ్రత్తలను పాటించాలని కోరారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. ఇటీవల సైబర్ క్రైమ్స్ పెరుగుతు న్నాయని వాటి పట్ల ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న సీఐ విజయభాస్కర్

# చౌక దుకాణాల ద్వారా రేషన్ పంపిణీ ప్రారంభం



**పాములపాడు, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని అన్ని రేషన్ దుకాణాల ద్వారా సరకులు సక్రమంగా పంపిణీ జరిగేలా సంబంధిత వీఆర్వోలు సిబ్బంది పర్యవేక్షణలో పంపిణీ జరు గుతుందని తహసిల్దార్ సుభద్రమ్మ తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని రుద్రవరం తుమ్మలూరు గ్రామాలలో రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు ఆమె మాట్లాడు తూ చౌక దుకాణాల ద్వారా రేషన్ పంపిణీ . జూన్ 1 నుంచి 15వ తేదీ వరకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు చౌక దుకాణాల్లో సరకులు పంపిణీ చేస్తారన్నారు. 65 సంవత్సరాలు దాటిన వారి ఇంటి వద్దకు వెళ్లి పంపిణీ చేస్తారని తెలిపారు. డిటి పటాన్ బాబు రెవెన్యూ సిబ్బంది ఆయా గ్రామాలలోరేషన్ పంపిణీ ప్రారంభించారు.

## శ్రీ పావన లక్ష్మీనరసింహస్వామి పునః ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే



ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** మండలంలోని ఓబులంపల్లి గ్రామంలో శ్రీ పావన లక్ష్మీనరసింహ స్వామి పునః ప్రతిష్ట కార్యక్రమంలో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పాల్గొని పూజలు నిర్వహించారు. ఓబులంపల్లి గ్రామంలోకి ఎమ్మెల్యే చేరుకోగానే గ్రామస్తులు ఎదురెల్లి స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను మధిర ఉన్న సమయంలో దేవాలయ శాఖ తో మాట్లాడి 25 లక్షల రూపాయలు మంజూరు చేయించానన్నారు. ఎమ్మెల్యే చేతుల మీదుగా ఈ పునః ప్రతిష్ట కార్యక్రమం జరగడం చాలా ఆనందంగా ఉందని ఓబులంపల్లె గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే భూమా అఖిలప్రియకు గజమాలతో సత్కారం చేశారు.

## రేషన్ షాపును ప్రారంభించిన సర్పంచ్ నిర్మలమ్మ

**జూపాడుబంగ్లా, మేజర్‌న్యూస్ :** రేషన్ షాపుల ద్వారా రేషన్ సరుకుల పంపిణీ సులభతరంగా ఉంటుందని పోతులపాడు సర్పంచ్ నిర్మలమ్మ అన్నారు. ఆదివారం మండలంలోని పోతులపాడు గ్రామంలో సర్పంచ్ నిర్మలమ్మ రేషన్ షాపును ప్రారంభించి రేషన్ పంపిణీ చేశారు. రేషన్‌ను షాపుల ద్వారా పంపిణీ చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ఈ నిర్ణయాన్ని ప్రజలు స్వాగతిస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వంలో ఎండియు వాహనాల ద్వారా రేషన్ పంపిణీ చేసేవారని ఆ వాహనాలు ఎప్పుడు వస్తాయో తెలిసేది కాదని అన్నారు. వృద్ధులకు, దివ్యాంగలకు ఇంటి వద్దనే రేషన్ అందజేయడం జరుగుతుందన్నారు. ప్రతి 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు రేషన్ నిర్దేశించిన సమయాల్లో అందజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పల్లె శివానంద రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



రేషన్ పంపిణీ చేస్తున్న దృశ్యం

## రేషన్ దుకాణాల ద్వారా సరుకులు పంపిణీ



ప్రజలు,సరుకుల కోసం క్యూలో నిల్చున్న కార్డుదారులు

(మొదటిపేజి తరువాయి..)

ఈ కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయిలో ప్రజా ప్రతినిధులు, జిల్లా స్థాయిలో మంత్రి టీజీ భరత్, జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా, జాయింట్ కలెక్టర్ నవ్య, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, రాష్ట్ర స్థాయి నుంచి వచ్చిన స్పెషల్ ఆఫీసర్ మోహన్‌బాబు, రాష్ట్ర స్థాయి సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్లు మహేష్‌గౌడ్, లక్ష్మీనారాయణ, స్థానిక నాయకులు పాల్గొని సరుకులు పంపిణీ చేశారన్నారు. ముఖ్యంగా జిల్లాలో 1233 రేషన్ దుకాణాలు ఉన్నాయని ఆదివారం 1233 రేషన్ దుకాణాల్లో కూడా నిత్యావసర సరుకులు పంపిణీ ప్రారంభం చేసి రాష్ట్రంలోనే జిల్లా మొదటి స్థానంలో నిలిచిందన్నారు. జిల్లాలో 6లక్షల71వేల కార్డుదారులు ఉండగా ఇప్పటివరకు 1లక్ష మంది కార్డుదారులకు(15శాతం) నిత్యవసర సరుకులు పంపిణీ చేసినట్లు తెలియజేశారు. అలాగే 65సం॥లు పైబడిన కార్డుదారులు జిల్లాలో 42వేల మంది ఉన్నారని అటువంటి వారిలో 5,200మంది కార్డుదారులకు నిత్యవసర సరుకులు ఇంటి వద్దకే డీలర్ల ద్వారా పంపిణీ చేయడం జరిగిందన్నారు.

## తాళం వేసిన ఇంట్లో చోరీ

**:- 10తులాల బంగారు,అర్ధ కేజీ వెండి అపహరణ**



బీరువాలోని వస్తువులు
చిందరవందరగా పడివున్న దృశ్యం



తలుపు పగలగొట్టిన దృశ్యం

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** నగరంలోని 3వ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నంద్యాల చెక్‌పోస్టు వద్దనున్న ఓ ఇంట్లో గుర్తు తెలియని దొంగలు ఇంటి తాళం పగలగొట్టి ఇంట్లోని 10తులాల బంగారు,అర్ధ కేజీ వెండిను అపహరించిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు నంద్యాల చెక్‌పోస్టు వద్ద నున్న కెపి రెడ్డి కాలనీలో నివాసముంటున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్ బాల చంద్రుడు ఇంట్లో దొంగలు పడి 10తులాల బంగారు,అర్ధ కేజీ వెండి, నగదును ఎత్తుకెళ్లినట్లు త్రీటౌన్ ఇంచార్జీ సిఐ నాగ శేఖర్ తెలిపారు. ఎక్సైజ్ శాఖలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న బాల చంద్రుడు బుధవారం రోజు కుటుంబ సమేతంగా షిరిడీకి వెళ్లాడు. ఇది గమనించిన దొంగలు దొంగతనానికి పాల్పడ్డారు. ఆదివారం ఉదయం ఇంటిపక్కన వారు బాలచంద్రుడుకి ఫోన్ చేసి మీ ఇంట్లో దొంగలు పడ్డారని తెలుపగా ఆయన ఇంటికొచ్చి చూసుకుంటే ఇంటి తలుపులు, బీరువా పగలగొట్టి ఉన్నాయి. బీరువాలో ఉన్న 10తులాల బంగారు నగలు, కొంత నగదు చోరీ గురయ్యాయని గ్రహించి 3వ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు 3వ పట్టణ ఇంచార్జ్ సిఐ నాగశేఖర్ తెలిపారు.

## నమ్మి ఓటేస్తే.. వెన్నుపోటు పొడిచింది మీరే - ఎమ్మెల్యే బుడ్డా

- రేషన్ సరుకుల పంపిణీని ప్రారంభించిన ఎమ్మెల్యే బుడ్డా
- వృద్ధులకు,వికలాంగులకు ఇళ్ళ వద్ద సరుకులు పంపిణీ చేసిన బుడ్డా
- పేదల సంక్షేమాభివృద్ధియే కూటమి ప్రభుత్వ ధ్యేయం
- వెన్నుపోటు కార్యక్రమాన్ని చేపట్టడం వైసిపి నాయకులకే సిగ్గుచేటు
- అభివృద్ధి పై చర్చకు సిద్ధమా ..శిల్పాకు సవాల్ విసిరిన బుడ్డా



రేషన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్:** ప్రజలు నమ్మి వైసిపికి ఓటేస్తే ఊహించని రీతిగా వెన్నుపోటు పొడిచి ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేశారని, అందుకే వెన్నుపోటు వైసిపికి ప్రజలు గట్టిగా బుద్ది చెప్పి మూలన కూర్చోబెట్టారని శ్రీశైలం నియోజకవర్గం శాసన సభ్యులు బుడ్డా రాజశేఖర్ రెడ్డి అన్నారు. ఆదివారం నియోజకవర్గ కేంద్రం ఆత్మకూరులో ఎమ్మెల్యే బుడ్డా రేషన్ షాపుల్లో పాతపద్ధతిలోనే సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని పునరుద్ధరిస్తు సరుకులు పంపిణీ చేశారు. పట్టణంలోని పెద్దబజార్, కొత్తపేట, గాంధీపార్క్ తదితర ప్రాంతాల్లో సరుకుల పంపిణీ ప్రారంభించి వికలాంగులు, వృద్దులకు ఇంటి వద్దనే సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుడ్డా మాట్లాడుతూ పేదల సంక్షేమాభివృద్ధియే కూటమి ప్రభుత్వ ధ్యేయమని, అందుకు కట్టుబడి ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామిని బాధ్యతగా నెరవేరుస్తు వస్తుందన్నారు. అధికారం చేపట్టిన ఏడాదిలోనే ఎంతో అభివృద్ధి చేశామని, అది చూసి ఓర్వలేని వైసిపి నాయకులు వెన్నుపోటు మరో నాటకానికి తెరలేపడం సిగ్గుచేటన్నారు. ప్రజలు పదే పదే వైసిపి మాయ మాటలను నమ్మరని అభివృద్ధి సంక్షేమానికి కట్టుబడి పనిచేసే పార్టీలకు ప్రజలు పట్టం కడతారని అన్నారు. నమ్మి ఓటేస్తే ప్రజలకు తీరని అన్యాయం చేసి వెన్నుపోటు పొడిచిన వైసిపి ప్రజలు బుద్దిచెప్పి మూలన కూర్చోబెట్టారని అన్నారు. మల్లి తామే వెన్నుపాటు కార్యక్రమాన్ని చేపట్టడం సిగ్గుమాలిన పని అని విమర్శించారు. నియోజకవర్గంలో గడిచిన ఏడాదిలో ఎంత అభివృద్ది జరిగిందో,వైసిపి ఐదేళ్ళ పాలనలో ఎంత అభివృద్ధి జరిగిందో తేల్చుకునేందుకు చర్చకు సిద్దమా అని మాజి ఎమ్మెల్యే శిల్పాకు సవాల్ విసిరారు. నియోజకవర్గ ప్రజలపై ఏమాత్రం పేమ ఉన్నా కూటమి ప్రభుత్వం చేసే అభివృద్ధికి సహకరించాలే కాని బురదజల్లే విధానాన్ని మార్చుకోవాలన్నారు. నమ్మకంతో ఓటేసిన ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామిని బాధ్యతగా అమలు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు , అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## వయస్సు చిన్నది-ఆలోచనలు పెద్దవి

- చిన్నమెదడులో పెద్ద ప్రయోగశాల
- వేసవి సెలవుల్లో ఇంటిదగ్గర ప్రయోగాలు
- 9వ తరగతి విద్యార్థి ప్రతిభ



చంద్రయానంతో విద్యార్థి నవీన్

**కోసిగి మేజర్ న్యూస్:** వనస్సు చిన్నదైనా ఆలోచనలు, ప్రయోగాలు పెద్దవిగా కనిపిస్తూ అనేక ప్రయోగాలు చేస్తూ ఆ బాలుడు ప్రతిభ కనబరుస్తున్నాడు. ఆ చిన్నమెదడులో పెద్ద ప్రయోగశాలే ఉన్నటులుగా వివిధ రకాలుగా ప్రయోగాలు చేస్తూ వేసవికాలాన్ని ఎంజాయ్ చేస్తున్న ఆ విద్యార్థి కోసిగి గ్రామానికి చెందిన అరికేరి నవీన్ తన ప్రతిభను చాటుతున్నాడు. కోసిగి గ్రామానికి చెందిన ఉరుకుందరోడ్డు సాయిబాబా కాలనీలో నివాసముంటున్న అరికేరి వెంకటేష్, తల్లి మాధవి అనే దంపతులకు చెందిన మొదటి సంతానమైన అరికేరి నవీన్ మోడల్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నారు. 9వ తరగతి పూర్తిచేసుకొని వేసవి సెలవులు రావడంతో ఇంటిదగ్గర ఆడుతూ, పాడుతూ ఉంటూ అప్పుడప్పుడు ప్రయోగాలు చేయడం జరుగుతూనే ఉంది. అయస్కాంతానికి (మాగ్నెటిక్) ఎంత పవర్ ఉందో అనే విషయాన్ని తెలుసుకునేందుకు తన ఇంట్లో ఉన్న స్పీకర్ అయస్కాంతాన్ని రేకులను కట్ చేసి ఫ్యాన్ రెక్కల మాదిరిగా తయారుచేసి, ఇంకొక బ్యాటరీని తయారుచేసి ఆ బాటరీ ద్వారా ఫ్యాన్ తిరిగుతూ ఉంది. అయితే ఆ ఫ్యాన్ వేగాన్ని ఏది తగ్గిస్తుంది అనే ఆలోచనతో మ్యాగ్నటిక్‌తో ఫ్యాన్ ఆగుతుందా.. లేదా.. అని ఫ్యాన్‌కు దారంకట్టి పినిస్‌తో అయస్కాంతానికి తగిలించడంతో ఫ్యాన్ వేగం పూర్తిగా తగ్గిపోయిన విషయాన్ని నవీన్ గుర్తించినట్లు తెలిపారు. అలాగే చంద్రయాన్-3 రాకెట్ తయారీకి ఇంట్లో ఉన్న దూది, పెళ్ళివేడుకల్లో వేసి బల్పులు, పేపర్‌తో చంద్రయాన్ రాకెట్‌లాగా తయారు చేసి చంద్రయాన్ రాకెట్ ఆకాశా నికి వెళ్ళేవిధంగా చేసి చూపించడం జరిగిం ది. వాటితోపాటు పాకిస్తాన్ ఉగ్రవాదులపై, సైనికులపై యుద్ధంచేసేందుకు సెంట్ బాటిళ్ళు, సెలైన్‌బాటిళ్ళు, ఇంజక్షన్ సహా యంతో ఇండియా నుండే పాకిస్తాన్‌కు వెళ్ళి బాంబు పడే విధంగా యుద్ధనౌకను తయారు చేశానని ఆ యుద్ధనౌక సక్సెస్ కాలేదని నవీన్ తెలపడం జరిగింది. ఇలా వేసవికా లంలో వివిధ రకాలుగా ప్రయోగాలు చేస్తూ అబ్దుల్‌కలాంను ఆదర్శంగా తీసుకొని తను కూడా సైంటిస్ట్ కావాలన్నదే ఆశ అని విద్యా ర్థి తెలిపారు. అయితే అరికేరి వెంకటేష్, మాధవి అనే దంపతులు ప్రతిరోజు కూలీ పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. అలాంటివారి ఇంట్లో ఇలాంటి చిన్నచిన్న మేధావులు పుట్టి పేదింటి ఆణిముత్యంలా, మట్టిలో మాణిక్యంలా కనిపిస్తుంటారు. అలాగే కోసిగి గ్రామంలో కూడా ఈ చిన్నారి కాబోయే శాస్త్రవేత్త అరికేరి నవీన్ అని కొయాడుతున్నారు.

## గత ప్రభుత్వం సన్నబియ్యం పేరిట మోసం చేసింది..!

- డీలర్ షాపుల వద్దే నిత్యవసర సరుకులు
- వృద్ధులకు, వికలాంగులకు ఇంటి వద్దకే సరుకులు అందిస్తాం
- రేషన్ పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే బీవీ



ఇంటి వద్దకు వెళ్లి వృద్ధులకు రేషన్ బియ్యం అందిస్తున్న ఎమ్మెల్యే బీవీ

**ఎమ్మిగనూరు టౌన్ మేజర్ న్యూస్ :** గత వైసీపీ ప్రభుత్వం సన్న బియ్యం అందిస్తామని ప్రజలకు నమ్మించి మోసం చేసిందని, కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రజలకు నాణ్యమైన బియ్యం అందిస్తున్నామని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి పేర్కొన్నారు. రేషన్ షాపుల ద్వారా నిత్యవసర సరుకులు పంపిణీ పునః ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆదివారం పట్టణంలోని 33, 44 రేషన్ షాప్‌లో వద్ద లబ్ధిదారులకు రేషన్ బియ్యాన్ని ఎమ్మెల్యే పంపిణీ చేశారు. వృద్ధులకు వికలాంగులకు వారి ఇంటి వద్దకు వెళ్లి రేషన్ సరుకులు అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే బీవీ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ లు కార్డుదారులకు రేషన్ షాప్‌లో వద్దనే సరుకులు పంపిణీ చేసే నిర్ణయం తీసుకోవడం సంతోషకరమన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఏర్పాటుచేసిన ఎండియు వాహనాలు ఎక్కడ ఎప్పుడు వస్తాయో ప్రజలకు తెలియలేని పరిస్థితి ఉండేది అన్నారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం రేషన్ షాపుల వద్దనే ప్రజలు వేలిముద్రలు వేసి సరుకులు తీసుకునే ప్రక్రియ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే వృద్ధులు వికలాంగులకు రేషన్ సరుకులు ఇంటి వద్దకే అందించే కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన బియ్యం అందిస్తుందన్నారు. గత ఐదు సంవత్సరాలుగా పండగలకు సంబంధించి తోఫాలు అందించలేదన్నారు. పేదల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం మంచి నిర్ణయాలకుముందుకు పోతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శేషఫణి, సీఎస్టిటి మహేష్, ఆర్ఐ హఫీజ్, వీఆర్వో మోహన్, టిడిపి నాయకులు కార్యకర్తలు పార్టీ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



రేషన్ షాపు వద్ద రేషన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బీవీ

# ఎకానమి

## APPSC, TGPSC గ్రూప్-1, 2 JL, DL

(గతవారం తరువాయి)

### పేదరికం - ప్రాక్టీస్ బిట్స్

**52. గ్రామీణ పేదరికాన్ని తగ్గించడంలో, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థలు (డిఆర్‌డిఏ) ఎలా తోడ్పడుతున్నాయి?**

ఎ. దేశంలో వెనుకబడిన ప్రాంతాలలో డిఆర్‌డిఎలు పంచాయితీ రాజ్ సంస్థలుగా పనిచేస్తున్నాయి.

బి. పేదరికం, పోషకాహార లోపాలకు గల కారణాలపై శాస్త్రీయ అధ్యయనాన్ని చేపట్టి వివరణాత్మకమైన పరిష్కార చర్యలను సిద్ధం చేస్తుంది.

సి. పేదరిక వ్యతిరేక కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయటానికి డిఆర్‌డిఎలు ఇంటర్ సెక్టోరల్ మరియు ఇంటర్ డిపార్ట్‌మెంటల్ సమన్వయం మరియు సహకారాన్ని పొందుతాయి.

డి. పేదరిక నిరోధక కార్యక్రమాల నిర్వహణ, మరియు వాటికోసం ఉద్దేశించిన నిధులను పర్యవేక్షించి, సమర్థవంతంగా వినియోగించబడడంలో డిఆర్‌డిఎలు బాధ్యత వహిస్తాయి.

పైన ఇచ్చిన స్టేట్‌మెంట్‌లలో ఏవి సరైనవో గుర్తించుము.

1. సి మరియు డి మాత్రమే
2. డి మాత్రమే సరైనది
3. ఎ,బి,సి,డిలు సరైనవి
4. ఎ,బి,సిలు మాత్రమే సరైనవి.

జవాబు : 1

**53. గ్రామీణాభివృద్ధి అంటే**

ఎ. సర్వేలు నిర్వహించడం, డేటాను రికార్డ్ చేయడం మరియు జనాభా గణాంకాలపై సమాచారాన్ని సేకరించడం.

బి. గ్రామీణ జీవితాలను మెరుగుపరచడం, ప్రజల ప్రాథమిక అవసరాలను తీర్చడం, గ్రామీణ ప్రజలను సామాజిక, సాంస్కృతిక మరియు ఆర్థిక కార్యక్రమాలలో పాల్గొనేలా ప్రోత్సహించడం.

సి. చట్టాలు మరియు నిబంధనలను ప్రవేశపెట్టడం

డి. ప్రాథమిక స్థాయిలో రాజకీయ సంస్థలకు సంబంధించిన కొత్త విధానాలను ప్రవేశపెట్టడం.

జవాబు : బి

**54. భారతదేశంలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కింది వాటిలో ఏది ముఖ్యమైనది?**

ఎ. గ్లోబల్ మార్కెట్ విస్తరణ

బి. కుటీర పరిశ్రమల స్థాపన

సి. సామాజిక మౌలిక సదుపాయాల కల్పన

డి. ఎన్‌జిఓలు

సమాధానం : సి

**55.జే.సి. కుమారప్ప ఒక ఫ్రేమ్‌వర్క్‌ను ప్రతిపాదించారు. కింది వానిలో దేనిని నొక్కి చెప్పారు?**

ఎ. నీటి పారుదల సౌకర్యాలను విస్తృతపరచడం

బి. శ్వేత విప్లవం

సి. హరిత విప్లవం

డి. గ్రామీణ పారిశ్రామికీకరణ

జవాబు : డి

**56. భారతదేశంలో గ్రామీణాభివృద్ధికి సంబంధించి శిక్షణ మరియు పరిశోధనలు చేసే సంస్థ ఈ క్రింది వానిలో**

ఎ. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ & పంచాయితీరాజ్

బి. రూరల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెవలప్‌మెంట్

సి. నేషనల్ రూరల్ ఇన్‌స్టిట్యూట్

డి. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థలు

జవాబు : ఎ

**57.ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన (పిఎమ్‌జిఎస్‌వై) కు సంబంధించి సరైన అంశాన్ని గుర్తించుము.**

ఎ. పిఎమ్‌జిఎస్‌వైని మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీ 2000 సంవత్సరంలో ప్రారంభించారు.

బి. ఈ పథకం ప్రస్తుతం మూడవదశ (పిఎమ్‌జిఎస్‌వై-3)లో ఉంది. దీనిని మాజీ ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ 2018-19 బడ్జెట్ ప్రసంగంలో ప్రారంభించారు.

సి. ఈ పథకం క్రింద ప్రస్తుతం 5,99,090 కి.మీ. మేర రహదారిని నిర్మించడం జరిగింది.

డి. మైదాన ప్రాంతాల్లో 500 కంటే ఎక్కువ జనాభా మరియు కొండ ప్రాంతాల్లో 250 కంటే ఎక్కువ జనాభా ఉన్న నివాసాలకు రోడ్డు కనెక్టివిటీని అందించడం ఈ పథకం లక్ష్యం.

పై అంశాలలో సరైనది గుర్తించుము.

1. ఎ,డి మాత్రమే 2. సి,డి సరైనవి
3. ఎ,సి,డి 4. ఎ,బి,సి,డి సరైనవి.

జవాబు : 4

**58. ఆడపిల్లల తిరస్కరణలను రక్షించడంద్వారా లింగ వివక్షను నిరోధించడం ఏ పథకం లక్ష్యంగా ఉంది?**

ఎ. జనని పథకం

బి. ఇంటిగ్రేటెడ్ చైల్డ్ ప్రొటెక్షన్ స్కీమ్

సి. అన్న అమృత హస్తం

డి. బాలికా శిశు రక్షణ పథకం.

జవాబు : డి

**59. జననీ సురక్ష యోజన అనేది ఒక**

ఎ. 100% రాష్ట్ర ప్రాయోజిత పథకం

బి. 100% కేంద్ర ప్రాయోజిత పథకం

సి. కేంద్ర, రాష్ట్రాల వాటా 50:50

డి. 100% ప్రైవేట్‌రంగం స్పాన్సర్ చేయబడుతుంది.

జవాబు : బి

**60. జననీ సురక్ష యోజన (జెయస్‌వై) ని జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ (ఎన్‌ఆర్‌హెచ్‌ఎమ్) కింద కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ కింది వాటిలో ఈ పథకం యొక్క లక్ష్యాలు ఏవి?**

ఎ. దారిద్ర్యరేఖకు దిగువున ఉన్న కుటుంబాల్లోని గర్భిణీ స్త్రీలకు మెరుగైన ఆహారం అందించడం.

బి. ఆరోగ్య కేంద్రంలో డెలివరీ సమయంలో మరియు ప్రసవానంతరం సంస్థాగత సంరక్షణను అందించడం.

సి. ప్రసూతి మరణాల మరియు శిశు మరణాల రేటును తగ్గించడం.

డి. అర్హత కలిగిన గర్భిణీ స్త్రీలు ప్రభుత్వ లేదా గుర్తింపు పొందిన ప్రయివేటు ఆరోగ్య సదుపాయం పొందిన తల్లి వయసు మరియు పిల్లల సంఖ్యతో సంబంధం లేకుండా నగదు సహాయం పొందటానికి అర్హులు.

పై స్టేట్‌మెంట్‌లను అనుసరించి సరైన సమాధానం ఎంచుకొనుము.

1. ఎ,బి,సి మరియు డి 2. ఎ మరియు డి
3. బి,సి మరియు డి 4. బి మరియు డి

జవాబు : 3




(గత సంచిక తరువాయి)

### ప్రభుత్వ పథకాలు

**ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పిఎమ్‌ఎఫ్‌బివై) :**

❍ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 18, ఫిబ్రవరి 2016న ప్రారంభించారు.

❍ రైతుల ఆదాయాన్ని స్థిరీకరించడంలో సహాయపడే పంట వైఫల్యానికి వ్యతిరేకంగా సమగ్ర బీమా రక్షణను అందించడం లక్ష్యంగా పెట్టుకుంది.

❍ ఈ పథకం వన్ నేషన్ - వన్ స్కీమ్ థీమ్‌కు అనుగుణంగా రూపొందించబడింది.

❍ ఇది జాతీయ వ్యవసాయ బీమా పథకం మరియు సవరించిన జాతీయ వ్యవసాయ బీమా పథకం అనే రెండు పథకాలను భర్తీ చేస్తుంది.

**లక్ష్యాలు :**

1. ప్రకృతి వైపరీత్యాలు, తెగుళ్ళు, వ్యాధుల ఫలితంగా నోటిఫై చేయబడిన ఏదైనా పంట విఫలమైనపుడు రైతులకు బీమా కవరేజ్, ఆర్థిక సహాయం అందించబడుతుంది.
2. వ్యవసాయంలో కొనసాగేలా రైతుల ఆదాయాన్ని స్థిరీకరించడం.
3. వినూత్న మరియు ఆధునిక వ్యవసాయ పద్ధతులను రైతులు అనుసరించేలా ప్రోత్సహించడం.
4. వ్యవసాయ రంగానికి రుణప్రవాహాన్ని నిర్ధారించడం.

**ప్రీమియం :**

❍అన్ని ఖరీఫ్ పంటలకు (ఆహారం మరియు నూనెగింజలు) 2% మరియు అన్ని రబీ పంటలకు 1.5% మాత్రమే ఏకరీతి ప్రీమియం రైతులు చెల్లించాలి.

❍వార్షిక వాణిజ్య మరియు ఉద్యాన పంటల విషయంలో రైతులు చెల్లించవలసిన ప్రీమియం 5% ఉంటుంది.

❍2016-17లో ప్రారంభమైనప్పటి నుండి 56.96 కోట్ల దరఖాస్తులు రాగా 1,54,469 కోట్ల క్లెయిమ్‌లు చెల్లించబడ్డాయి.

**స్కిల్ ఇండియా మిషన్ (యస్ఐఎమ్) :**

❍2015లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్కిల్ ఇండియా మిషన్‌ను ప్రారంభించారు.

❍2022నాటికి దేశంలో 40 కోట్ల మందికి పైగా వివిధ నైపుణ్యాలలో శిక్షణ ఇవ్వడం ఈ పథకం ప్రధాన ఉద్దేశ్యం.

**ప్రధానమంత్రి కౌసల్ వికాస్ యోజన (పిఎమ్‌కెవివై) :**

❍ఈ పథకం 2015లో ప్రారంభించబడినది.

❍పెద్ద సంఖ్యలో భారతీయ యువత పరిశ్రమకు సంబంధించిన నైపుణ్య శిక్షణను పొందేలా చేయడం, వారికి మెరుగైన జీవనోపాధిని కల్పించడం ఈ పథకం లక్ష్యాలు.

**మేక్ ఇన్ ఇండియా :**

❍సెప్టెంబరు 2014లో మేక్ ఇన్ ఇండియా చొరవను ఆవిష్కరించారు.

**లక్ష్యాలు :**

❍భారతదేశాన్ని గ్లోబల్ మ్యానుఫ్యాక్చరింగ్ పవర్ హౌస్‌గా రూపొందించడం.

❍తయారీ రంగం యొక్క సహకారాన్ని జిడిపికి 25%కి పెంచడం.

❍2022 నాటికి 100 మిలియన్ల ఉద్యోగాలను సృష్టించడం

❍దేశంలో వ్యాపారాన్ని సులభతరం చేయడం.

❍విదేశీ సంస్థలకు మాత్రమే కాకుండా దేశీయ కంపెనీలు తమ ప్లాంట్లను దేశంలో ఏర్పాటు చేసుకోవటానికి ప్రోత్సాహాన్ని అందించడం.

❍అయితే తయారీ రంగం యొక్క జిడిపి వాటా 2022 నాటికి 25%కి చేరుకుంటుందని అంచనా వేయబడింది. అయితే వాస్తవానికి 2013-14లో 16.7% నుండి 2023-24లో 15.9%కి పడిపోయింది.

**స్టార్టప్ ఇండియా :**

❍స్టార్టప్ ఇండియా, జనవరి 16, 2016లో ప్రారంభమైనది.

❍దేశంలో ఇన్నోవేషన్ మరియు స్టార్టప్‌ల వృద్ధి కోసం బలమైన పర్యావరణ వ్యవస్థను నిర్మించే లక్ష్యంతో స్టార్టప్ ఇండియా యాక్షన్ ప్లాన్‌ను ప్రధాని ప్రారంభించారు.

❍దేశ నిర్మాణానికి, సామాజిక ఆర్థికాభివృద్ధికి మరియు స్వావలంబనకు దోహదపడే స్టార్టప్‌లను గుర్తించి ప్రోత్సహించేందుకు 2022లో జనవరి 16ని జాతీయ స్టార్టప్ డేగా ప్రధాని ప్రకటించారు.

❍ఈ పథకం క్రింద ప్రభుత్వం, అంకుర పరిశ్రమల స్థాపనను ప్రోత్సహించడానికి పన్ను, సబ్సిడీ, మూలధన సబ్సిడీలను ప్రకటించింది.

❍స్టార్టప్ పరిశ్రమ అభివృద్ధికై ప్రభుత్వం మూడు సంవత్సరాల పాటు ఆదాయ పన్ను మినహాయింపును ప్రకటించింది.

**స్టాండ్ - అప్ ఇండియా పథకం :**

❍ఏప్రిల్ 5, 2016లో ప్రారంభమైనది.

❍ఈపథకం 2025 సంవత్సరంవరకు పొడిగించబడినది.

❍యస్‌సి, యస్‌టి మహిళా పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించడం ప్రధాన ఉద్దేశ్యము.

1కోటి రూపాయల వరకు ఋణ సౌకర్యాన్ని అందించబడుతుంది.

❍గత 7సంవత్సరాల్లో 1,80,636 ఖాతాలకు సంబంధించి ఈపథకం క్రింద రూ.40,710కోట్లు మంజూరు చేయ బడ్డాయి.

❍ఈపథకం క్రింద ఇచ్చిన ఋణాలలో 80% పైగా మహిళలకు అందించబడ్డాయి.



ఎం.అన్నారెడ్డి
సీనియర్ ఫ్యాకల్టీ
హనుమకొండ.

# చౌకధర దుకాణాల ద్వారా పేదలకు నిత్యావసర సరకులు పంపిణీ


హెబ్బటంలో బియ్యం పంపిణి చేస్తున్న టీడీపీ నాయకులు

**హొళగుంద,మేజర్‌న్యూస్‌:** రాష్ట్ర ప్రభుత్వం నిత్యావసర సరకులను చౌకధర దుకాణాల ద్వార నుండి పునః ప్రారంభించడానికి శ్రీకారం చయట్టింది.అందులో భాగంగా ఆదివారం మండలంలోని ప్రతి గ్రామాలో కూటమి నాయకులు చౌకధర దుకాణాలలో పేదలకు బియ్యం పంపిణి చేశారు.ఈ నెల 15వ తేది వరకు కార్డు ఉన్న వారందరికి నిత్యావసర సరకులను తప్పక పంపిణి చేయాలని డీలర్లకు చెప్పడం జరగింది.వృద్దులకు,వికలాంగులకు ఇండ్లకు వెళ్లి సరకులను అందించాలన్నారు.గత ప్రభుత్వం ఎండియూల ద్వార వీధులలో నిత్యావర సరకులను పంపిణి చేసిందిని అలా చెయడం వల్లా బియ్యం పేదలకు సక్రమంగా అందకుండా బ్లాక్ మార్కెట్‌కు తరలించే వారని నాయకులు చెప్పారు.ఆక్రమాలకు తావు ఇవ్వకుండా చౌకధర దుకాణాల ద్వార పేదలకు నిత్యావసర సరకులను అందించడంతో ప్రతి ఒక్కరికి సరకులు అందుతాయని చెప్పారు.ధరల పట్టిక ఆధారంగా ఆక్రమాలకు పాల్పడకుండా పేదలకు సరకులను అందించాలని నాయకులు డీలర్లకు తెలియజేశారు.మండల పరధి లోని హెబ్బటం గ్రామంలో యువ నాయకుడు వీరసేనారెడ్డి,ఉప సర్పంచ్ సవారప్ప,నరసప్ప, చిన్ననాగయ్య,గోఫాల్,శేక్షావలి, హొళగుందలో తిప్పయ్య,మోయిన్, రాము,సుభాన్,తిక్కస్వామి, జాకీర్,మహేశ్,ఉలిగన్నం,విఆర్‌ఒ తిప్పన్న పాల్గొన్నారు.

# చౌక దుకాణాలలో రేషన్ బియ్యం పంపిణీ


రేషన్ దుకాణాన్ని ప్రారంభించిన తెదేపా నాయకులు

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** పండుగ వాతావరణంలో మండల వ్యాప్తంగా చౌక దుకాణాల వద్ద రేషన్ బియ్యం పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఆదివారం మండల పరిధిలోని నన్నూరు గ్రామంలో తహశీల్దార్ విద్యాసాగర్ టిడిపి నాయకులు విశ్వేశ్వర్‌రెడ్డి, విఆర్‌ఓ మోహన్, పలువురు టిడిపి నాయకులతో కలిసి లబ్దిదారులకు రేషన్ బియ్యం పంపిణీ చేశారు. ఓర్వకల్లు మండల కేంద్రంలో మండల టిడిపి కన్వీనర్ గోవిందరెడ్డి, విఆర్‌ఓ సామన్నలు రేషన్ షాపుల వద్ద రేషన్ పంపిణీ చేపట్టారు. మీదివేముల గ్రామంలో విఆర్‌ఓ సుమన, తెదేపా నాయకులు రామాంజనేయులు, ఉయ్యాలవాడలో విఆర్‌ఓ మహబూబ్ బాషా, టిడిపి నాయకులు దీబకుంట్ల రమణారెడ్డి, కృష్ణయ్య చౌదరితో కలిసి రేషన్ బియ్యం పంపిణీ కార్యక్రమం చేపట్టారు. గుట్టపాడులో సర్పంచ్ మోహన్‌రెడ్డి, విఆర్‌ఓతో కలిసి రేషన్ పంపిణీ చేశారు. కన్నమడకలలో విఆర్‌ఓ, టిడిపి నాయకులు సుధాకరయ్య, వెంకటేశ్వర్లు రేషన్ షాపులు ప్రారంభించి రేషన్ బియ్యం పంపిణీ చేపట్టారు. లొద్దిపల్లెలో టిడిపి నాయకులు పరమేశ్వర్‌రెడ్డి, పెద్దగిడ్డయ్యలు విఆర్‌ఓలతో కలిసి రేషన్ షాపును ప్రారంభించి పేదలకు సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణీత సమయం ప్రకారం అర్హులైన పేదలకు బియ్యాన్ని ఇబ్బంది లేకుండ అందించాలని అన్నారు. ప్రతి నెల 15వ తేదీలోపు ఎప్పుడైనా కార్డు కలిగిన వారు సరుకులు తీసుకోవచ్చని, 65ఏళ్లు నిండిన వృద్దులకు ఇంటి దగ్గరికే రేషన్ అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల్లోని రేషన్ షాపు డీలర్లు, తెదేపా నాయకులు పట్టేల మోహన్, శ్రీపతి బుజ్జప్ప, పెద్ద మునిస్వామి, ఎల్ఐసి మద్దయ్య, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## నేడు కళారాధన వేసవి శిక్షణా శిబిరాల ముగింపు ఉత్సవం

**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్:**




కళారాధన సాంస్కృతిక సంస్థ గత 25 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న ఉచిత లలిత కళల వేసవి శిక్షణ శిబిరం ముగింపు ఉత్సవం సోమవారం సాయంత్రం ఐదు గంటల నుండి మున్సిపల్ టౌన్ హాల్లో నిర్వహిస్తున్నట్లు కళారాధన సాం స్కృతిక సంస్థ అధ్యక్షులు డాక్టర్ సి.మధుసూ దనరావు.ప్రధాన కార్యదర్శి డాక్టర్ జి.రవికృష్ణ, కార్యనిర్వాహక కార్యదర్శి, క్యాంప్ కోఆర్డినే టర్‌పత్తి రంగనాథ్ తెలిపారు.ఆదివారం వారు మాట్లాడుతూ కళారాధన, నంద్యాల లయ న్స్ క్లబ్, ఐఎంఏ సంయుక్త నిర్వహణలో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మక సాంస్కృతిక శాఖ సహకారంతో మే 1వ తేదీ నుండి జూన్ రెండవ తేదీ వరకు 300 మంది బాల బాలికలు, యువతకు వివిధ అంశాలలో 30మంది కోచ్ లతో స్థానిక కేవిఎం పురపాలక పాఠశాల ఆవరణలో ఉచిత శిక్షణ శిబిరం నిర్వహించిన్నట్లు తెలిపారు. ముగింపు ఉత్సవంలో శిక్షణ పొందిన బాలబాలికల సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇదే కార్యక్ర మంలోనే పదవ తరగతిలో జిల్లా స్థాయిలో ప్రథమ ద్వితీయ తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేకంగా ప్రథమ ద్వితీయ తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు రిటైర్డ్ జిల్లా విద్యాశాఖ అధికారి గుర్రాల రామకృష్ణయ్య ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేసి ఘనంగా సత్కరిస్తామని అన్నారు.ఈ సాంస్కృతిక కార్యక్రమాలు తిలకించడానికి కళాభిమానులందరినీ కళారాధన ఆహ్వానిస్తున్నదని తెలిపారు.

## షెడ్ దగ్ధం..రూ.4 లక్షల మేర నష్టం

**పాములపాడు, మేజర్ న్యూస్ :** గ్రీన్ పామ్ ఆయిల్ షాప్ షెడ్ కాలిపోవడంతో రూ.4 లక్షల మేర నష్టం జరిగిందని యజమాని మహేష్ తెలిపారు. పాములపాడులోని సబ్-స్టేషన్ దగ్గర టిఎన్ఆర్ కన్స్ట్రక్షన్ ఆవరణలో ఉన్న ఆయిల్ షెడ్ ఆదివారం ప్రమాదవశాత్తు కాలిపోయింది. ఈ ప్రమాదంలో విలువైన వస్తువులన్నీ కాలిపోయాయని వాహనాలకు సంబంధించిన స్పేర్ పార్ట్స్ కాలిపోయాయని ఎవరూ లేని సమయంలో ఇలా జరిగిందని ప్రభుత్వం స్పందించి కుటుంబాన్ని తనను ఆదుకోవాలని బాధితుడు మహేష్ వాపోయాడు.



# బక్రీద్‌ను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి -డిఎస్పి


మాట్లాడుతున్న డిఎస్పి రామాంజి నాయక్

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్:** ముస్లింలు బక్రీద్‌పండుగ నాడు ఎలాంటి గొడవలకు తావివ్వకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని డిఎస్పి రామాంజి నాయక్ అన్నారు. ఆదివారం జిల్లా ఎస్పి ఆదేశాల మేరకు స్థాని పోలీసు స్టేషన్‌లో సిఐ రాము, ఎస్ఐ నారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ముస్లీం మత పెద్దలు, పీస్ కమిటి సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ పట్టణ, పరిసర ప్రాంత ముస్లీం సోదరులు బక్రీద్ పండుగ సందర్భంగా ఎలాంటి గొడవలు చేసుకోరాదని అన్నారు. పట్టణ , పరిసర ప్రాంత ప్రజలు వారి వారి సంప్రదాయాలను గౌరవిస్తు వారికి సహరించాలని అన్నారు. ఇతరులకు ఇబ్బంది కలిగించరాదని, కుర్బాని వారికి కేటాయించిన ప్రదేశాలలోనే చేసుకోవాలని తెలియజేశారు. చట్టాన్ని అతిక్రమిస్తే ఎవరైన సరే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీస్ కమిటి సభ్యులు, ముస్లీం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తులో మార్పు తీసుకొస్తాం..

**ఎమ్మిగనూరు టౌన్,మేజర్‌న్యూస్ :** ప్రభుత్వం కోరుకున్నది నైపుణ్య ఆధారిత విద్య అని, అలాంటి విద్యను విద్యార్థుల చక్కటి కెరియర్ ఫలితాల కోసమే భాగస్వామ్య అంతిమ లక్ష్యం అనినెక్ట్‌వేవ్-ఎన్ఐఏటి కో ఫౌండర్ సీఈవో రాహుల్ అత్తులూరి పేర్కొన్నారు. "ప్రపంచ స్థాయి నిపుణుల్లా తయారు కావాలంటే డిగ్రీతోపాటు స్కిల్స్, యాటిట్యూడ్ ఎంతో అవసరం. ఎన్ఐఏటి సహకారంతో తమ విద్యార్థులు గ్లోబల్ స్టాండర్డ్స్ కు అనుగుణంగా శిక్షణ పొందుతారు" అని అజింకియ డివై పాటిల్ వైస్ ఛాన్స్ లర్ డాక్టర్ రాకేష్ కుమార్ జైన్‌అన్నారు.ప్రస్తుత ప్రపంచంలో చక్కటి కెరియర్ కు డిగ్రీతోపాటు చక్కటి నైపుణ్యాభివృద్ధి ఎంతో అవసరమని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ - ఛాన్స్ లర్ సిహెచ్ వి పురుషోత్తం రెడ్డి తన అభిప్రాయం వ్యక్తం చేశారు.వారు మాట్లాడుతూ మూడు వేలకు పైగా టేక్ కంపెనీల లోని అవకాశాలను విద్యార్థులకు కనెక్ట్ చేస్తుందని తెలిపారు. వాటికి అనుగుణంగా తాము పక్కాగా పని చేసే మోడల్ ను నిర్మించామని వెల్లడించారు.ఇదివర్సిటీల్లోవిద్యార్థుల భవిష్యత్తులో నిజంగా మార్పు తీసుకొస్తుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. డిగ్రీతో పాటు భరోసా కలిగిన భవిష్యత్తు ఇవ్వగలగటం తమ భాగస్వామ్యం ప్రత్యేకత అని వివరించారు.

# వాల్మీకుల అభివృద్ధికి సాయశక్తుల కృషి చేస్తా


బోయ మహేంద్రనాయుడు

**డోన్, మేజర్‌న్యూస్‌:** వాల్మీకి బోయల అభివృద్ధికి తనవంతు సాయశక్తులా కృషి చేస్తానని బోయ మహేంద్రనాయుడు అన్నారు. ఆదివారం వాల్మీకి రాష్ట్ర నాయకులు మహర్షి వాల్మీకి బోయ సంఘం నంద్యాల జిల్లా సోషల్ మీడియా కో ఆర్డినేటర్‌గా బోయ మహేంద్రనాయుడిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా బోయ మహేంద్రనాయుడు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి మహర్షి వాల్మీకి బోయ సంఘం నంద్యాల జిల్లా సోషల్ మీడియా కో ఆర్డినేటర్‌గా ఎన్నుకొని, ఇంతటి బాధ్యతను తనకు అప్పగించిన మహర్షి బోయ వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.ప్రభాకర్, ఉపాధ్యక్షులు మహేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి జక్కుల శ్రీనివాసరావు, స్టేట్ ప్రొఫెషనల్ వింగ్ అధ్యక్షులు సురేష్‌నాయుడు మరియు వాల్మీకి సంఘం పెద్దలకు, వాల్మీకి సోదరులకు కృతజ్ఞతలు తెలపడం జరిగిందన్నారు.

## లారీ ఢీకొని ఒకరు మృతి..మరొకరికి తీవ్ర గాయాలు




మృతి చెందిన సురేష్(35),తీవ్రంగా గాయపడిన ప్రహల్లాద అలియాస్ బాలు

**వెల్దుర్తిరూరల్, మేజర్‌న్యూస్‌:** స్థానిక వెల్దుర్తి పోలీసుస్టేషన్ పరిధిలోని చెరుకులపాడు క్రాస్ రోడ్డులోని 44వ నెంబర్ జాతీయ రహదారిపై ఆదివారం బైక్, లారీ ఢీకొని క్రిష్ణగిరి మండలం, ఎరుకులచెరువు గ్రామానికి చెందిన సురేష్(35) అక్కడికక్కడే మృతి చెందగా, మరొక వ్యక్తి ప్రహల్లాద అలియాస్ బాలుకు తీవ్ర రక్తగాయాలు కావడంతో 108 అంబులెన్స్‌లో మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరించినట్లు సమాచారం. సురేష్ మృతదేహాన్ని వెల్దుర్తి సిహెచ్‌సి ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం సోమవారం జరగవచ్చు అనే సమాచారం. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# ఘనంగా ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి జన్మదిన వేడుకలు

**డోన్‌రూరల్, మేజర్‌న్యూస్‌:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి జన్మదిన వేడుకలను టిడిపి నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఎంఎస్ఆర్ కార్యాలయం నందు ఏపిఎస్ఎస్‌డిసిఎల్ చైర్మన్ ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని టిడిపి నాయకులు, కార్యకర్తలు, ఎంఎస్ఆర్ అభిమానులు కేక్‌కటింగ్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా ఎంఎస్ఆర్ యూత్ ఆధ్వర్యంలో డోన్ ప్రభుత్వ ఆసుపత్రి నందు రోగులకు పండ్లు, బ్రెడ్లు, పండ్ల రసాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డోన్ నియోజకవర్గం టిడిపి యువనేత ధర్మవరం మన్నె గౌతమ్ కుమార్ రెడ్డి, మాజీ ఎంపిపి ఆర్‌ఈ.రాఘవేంద్ర, ప్యాపిలి మండల టిడిపి అధ్యక్షులు గండికోట రామ సుబ్బయ్య, నంద్యాల జిల్లా టిడిపి బీసిసెల్ అధ్యక్షులు ప్రజావైద్యశాల బెస్త మల్లికార్జున, రాష్ట్ర లీగల్ సెల్ మెంబర్ మధుసూదన్‌గౌడ్, న్యాయవాది కల్ల మహేశ్వరరెడ్డి,యాపదిన్నె సర్పంచ్ రామిరెడ్డి, డోన్ పట్టణ బీసి అధ్యక్షులు చక్రపాణిగౌడ్, ఉడుములపాడు టివి.ప్రవీణ్‌రెడ్డి, చిన్నకాంత్, పట్టణ టిడిపి తెలుగుయువత ప్రధాన కార్యదర్శి సిటీకేబుల్ కిరణ్, తెలుగుయువత నాయకులు చనుగొండ్ల కోనేటి కాశీ, మురళీ, పార్థసారధిరెడ్డి(పార్థు), సీసంగుంతల బబ్లూయాదవ్, బిఎడ్.భాషా, వడ్డె శ్రీనివాసులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, ఎంఎస్ఆర్ అభిమానులు పాల్గొన్నారు.

**శ్రీమద్దిలేటిస్వామి క్షేత్రంలో ప్రత్యేక పూజలు :** ఆంధ్ర ప్రదేశ్ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని బేతంచెర్ల మండలం ఆర్ఎస్.రంగాపుం గ్రామం దగ్గర వెలసినటువంటి శ్రీమద్దిలేటిస్వామి క్షేత్రం నందు ఆదివారం మన్నె సుబ్బారెడ్డి పేరుతో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు నియోజకవర్గం టిడిపి యువనేత ధర్మవరం మన్నె గౌతమ్‌కుమార్‌రెడ్డి, బేతంచెర్ల మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు, ఎంఎస్ఆర్ అభిమానులు పేర్కొన్నారు. ఈ పూజా కార్యక్రమంలో బేతంచెర్ల పట్టణ టిడిపి ప్రధాన కార్యదర్శి శేషావలిచౌదరి, డోన్ మండలం యాపదిన్నె గ్రామ సర్పంచ్ రామిరెడ్డి, కొచ్చెర్వు మధుసూదన్‌రెడ్డి, జీవన్‌చౌదరి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.


ఎంఎస్ఆర్ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

సూర్య
www.suryaa.com
సోమవారం | 02 జూన్ 2025

# రేషన్ సరుకుల దుకాణాన్ని పునః ప్రారంభించిన మంత్రి బిసి



దివ్యాంగుడికి ఇంటి వద్దనే రేషన్ సరుకులు అందజేస్తున్న మంత్రి బీసీ

**బనగానపల్లె, మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన రూటమి ప్రభుత్వం రేషన్ పంపిణీని రేషన్ షాపుల వద్ద నుండే లబ్ధిదారులు పొందేవిధంగాజూన్1నుండి రేషన్ పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలో రాష్ట్ర రోడ్లు భవనాలు పెట్టుబడులు మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆదివారం బనగాన పల్లె పట్టణంలో రేషన్ సరుకుల దుకాణాన్ని పునః ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇకపై నెలలో 15 రోజుల పాటు.. రోజు రెండు పూటల.. చౌక ధరల దుకాణాల ద్వారా రేషన్ సరుకుల పంపిణీ పేదలకు ప్రభుత్వం అందించే రేషన్ సరుకుల చౌక ధరల దుకాణాలు గత ప్రభుత్వంలో మూసేసి, ఇంటింటికి అందిస్తాం అని రూ.1600 కోట్లతో వాహనాలు కొనుగోలు చేసి, ఇంటింటికి ఇవ్వడం మానేసి నెలలో 1-2 రోజులు మాత్రమే జంక్ష న్లలో వాహనం నిలిపి ఇవ్వడంతో ఎంతోమంది పేదలకు ఆ సరుకు లు అందక ఇబ్బం దులు పడ్డారు. ఆ వాహనం ఎప్పుడు వస్తుందో తెలియక రోజువారీ పనులు మానుకొని, చిరు ద్యోగాలకి సెలవు పెట్టకోవాల్సి వచ్చేది. మిగిలిన



మహిళకు రేషన్ షాపు వద్ద రేషన్ సరుకులు అందిస్తున్న మంత్రి బీసీ

రేషన్ బియ్యం, సరుకులను అక్రమంగా తరలిస్తున్న విషయంపై గౌరవ ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు గారి నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రతీ పేద కుటుంబానికి రేషన్ సరుకులు అందించేందుకు ఇకపై ప్రతి నెలా 1వ తేదీ నుంచి 15 వ తేదీ వరకు.. ఉదయం 8గం.ల నుంచి 12 గం.ల వరకు అలాగే సాయంత్రం 4గం.ల నుండి8గం.ల వరకు రేషన్ డీలర్ల దుకాణాల వద్ద అందించనున్నాము. దీని ద్వారా రద్దీని తగ్గించడమే కాకుండా, ప్రతీ ఒక్క కుటుంబానికి అందేలా చర్యలు తీసుకుంది. అంతేకాకుండా దివ్యాంగులకు, 65 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు ఇంటి వద్దనే రేషన్ సరుకులు అందించే సౌకర్యాన్ని కూడా ప్రభుత్వం కల్పించింది. ఈ సదుపాయాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణంలోని తెలుగు దేశం పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆలూరులో అనంత పెత్తనం..

**దేవనకొండ ఎఒ పోస్టుకు హై రెకమెండేషన్..**
**డమ్మీగా మారిన ఇన్‌ఛార్జీ పెత్తనం..**
**పెద్దల ఆదేశాలతో ముందుకు సాగుతున్న వైనం..**

**దేవనకొండ, మేజర్ న్యూస్ :** రాష్ట్ర వ్యాప్తంగా కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటికీ ఆలూరు నియోజకవర్గంలో మాత్రం టిడిపి అభ్యర్థి ఓటమి చవి చూడటంతో ఇక్కడ ఇన్చార్జీ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. అన్ని నియోజకవర్గాలలో ఆయా నాయకులు ఏకతాటిగా ముదుకు వెళుతే తమకు నచ్చిన వారినే తమ మండలానికి రప్పిస్తున్నారు. అయితే గత ఏడాదిగా ఆలూరు నియోజకవర్గంలోని దేవనకొండ మండలంలోని పరిస్థితులు మాత్రం రోజు రోజుకూ దిగజారి పోతోతున్నాయి. మండలంలోని నాయకులు చీలి పోవడమే కాకుండా మండలంలో ఏ పనులు కావాలన్నా మండలానికి ఏ అధికారి కావాలన్నా వారి నిర్ణయం మూడు ముక్కలాటగా మారింది. దీనిని ఆసరాగా చేసుకొన్న అనంతపురం జిల్లాకు చెందిన నాయకులు ఆలూరుపై పెత్తనం చెలాయిస్తూ దేనవకొండ మండల వ్యవసాయాధికారి పోస్టుకు సిఎం కార్యాలయం నుండి హై రెకమెండేషన్‌తో తమ అభ్యర్థిని నియమించేందుకు ఆదేశాలు ఇచ్చారని చర్చలు జోరందుకున్నాయి. పార్టీ పెద్దలు నియోజకవర్గ ఇన్చార్జీ వీరభద్ర గౌడను డమ్మీగా మార్చి నోరు మెదపకుండా చేశారని తెలుస్తోంది, విధులలో బాగంగా ప్రస్తుత మండల వ్యవసాయాధికారి సురేష్ బాబుకు ఏడాది కాలం ఉన్నప్పటికీ అధికార పార్టీకి చెందిన అనంతపురం జిల్లా నాయకుల జోక్యంతో ఓ మహిళా అధికారిణిని దేవనకొండ వ్యవసాయాధికారి గా ఆదేశాలు ఇచ్చినట్లు తెలిస్తోంది. ప్రస్తుతం కర్నూలు జిల్లాలోని వ్యవసాయ శాఖ పిఎం కిసాన్ విభాగంలో లో విధులు నిర్వహిస్తున్న ఆ అధికారిణిని ఆలూరు ఇన్చార్జీ,దేవనకొండ మండల నాయకుల ప్రమేయం లేకుండానే బదిలీపై దేవనకొండకు పంపేందుకు జిల్లా అధికారులు చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. దీనిని జీర్ణించుకోలేని మండల నాయకులు హై రెకమెండేషన్‌తో మండలానికి వ చ్చిన ఆ అధికారికి ఇక్కడ పరిస్థితులు ఏం తెలుసని కేవలం తమ వ్యక్తిగత లాభార్జనకే ఇక్కడకు వస్తున్నారని మండి పడుతున్నారు. అయితే గతంలో కూడ ఆలూరులో విధులు నిర్వహిస్తున్న ఓ అధికారి దేవనకొండ మండలానికి వచ్చేందుకు తీవ్రంగా ప్రయత్నించారని కానీ ప్రస్తుతం హై రెకమెండేషన్‌తో మరో అధికారిణి ఇక్కడకు వచ్చేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. మరి సక్రమంగా విధులు నిర్వహించే అధికారులు ఏ మండలంలోనైనా పని చేస్తారని కానీ కేవలం తమ వ్యక్తిగత లాభార్జన చూసుకునే అధికారులు మాత్రమే ఇలా హై రెకమెండేషస్‌తో రైతులను ముంచేందుకు వస్తారని పలువురు ఆరోపిస్తున్నారు. మరి మండలంలో ఏం జరుగనుందో వేచి చూడాలి.

# విశ్వాస్ అండ్ వివికె వెంచర్ రియల్ మోసాలు

**ప్లాటు లేదా డబ్బులు తిరిగి ఇవ్వాలని బాధితుల డిమాండ్**



నిరసన వ్యక్తం చేస్తున్న కమిటీ సభ్యులు

**డోన్, మేజర్‌న్యూస్ః** క్రిష్ణగిరి మండలం, అమకతాడు గ్రామ పరిధిలోని టోల్ ప్లాజా దగ్గర ఉన్న సర్వే నెంబర్లు 275, 276, 290, 291, 321-1, 320, 321 గల సర్వే నెంబర్లు విశ్వాస్ అండ్ వివికె మరియు రాయలసీమ రతనాలసీమ టౌన్‌షిప్ లో రైతులతో కొనుగోలు చేసి వెంచర్ వేయడం జరిగింది. ఈ వెంచర్‌లో కొనుగోలు, అమ్మకాలు జరిగినట్లు విశ్వాస్ అండ్ వివికె ప్లాట్ల ఓనర్లు తెలిపారు. ఆదివారం ఓనర్లు ఒక టీంగా ఏర్పడి విశ్వాస్ అండ్ వివికె వెంచర్ ఓనర్ విజయ్‌కుమార్ చేసిన మోసానికి అందరం నష్టపోయామని, అందరూ ఒక తాటిపైకి వచ్చి వారి బాధలను తెలియజేశారు. గతంలో ప్లాట్లు అమ్ముకునేందుకు మాకు మాయమాటలు చెప్పి ప్లాట్లు విక్రయాలు చేసుకోవడం జరిగిందని, అయితే నేడు వాటికి సంబందించిన ప్లాట్ల నెంబర్లు గాని లేవన్నారు. కావున మండల స్థాయి రెవెన్యూ అధికారులు జోక్యం చేసుకొని బాదితులకు న్యాయం చేయాలని లేని పక్షంలో వెంచర్ యాజమాన్యంపై జిల్లా స్థాయి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ విషయం తెలుసుకొని పలుమార్లు విజయకుమార్, వాకా వాసుదేవరావులను సంప్రదించగా, అందుబాటులోకి రాకపోగా కనీసం స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై రెవెన్యూ అధికారులను, పోలీసులను ఆశ్రయిస్తే వారు సానుకూలంగా స్పందించారని, తమ ప్లాట్లను రీసర్వే చేసి తమ ప్లాట్ నెంబర్లు కేటాయించి తమకి అప్పగించాలని కోరారు. వెంచర్ ఓనర్‌పై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళి, అతనిపై చర్యలు తీసుకునేంతవరకు మా పోరాటం ఆగదన్నారు. విశ్వాస్ అండ్ వివికె ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు డి.శివయ్య, డాక్టర్ ముత్యాలయ్య, పిఎస్‌కె.శిరీష్, ఎబి. వెంకటరమణ, ఆర్.రమేష్, సురేష్‌బాబు,ఎం.శివయ్య,ఏ.రామ్మూర్తి, డి.బాల ఆంజనేయులు,యు.మెహబూబ్‌భాష,ఎస్.చాంద్‌భాషా,ఎం.భాస్కర్,గౌస్‌భాష,టీంసభ్యులు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువులు ప్రజలకు అందేలా

# చర్యలు తీసుకోవాలి

**ఆదోని, మేజర్ న్యూస్ :** ఆదోని పట్టణంలోని అంబేద్కర్ నగర్‌లో షాపునెం.62వద్ద చౌక ధరల దుకాణంలో రేషన్‌సరుకులు పంపిణీ కార్యక్రమాన్ని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ రేషన్ లబ్దిదారులతో రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ, పౌర సరఫరాల శాఖ ద్వారా నిత్యావసర సరుకులు చేసే కార్యక్రమంలో ప్రజాభిప్రాయ సేకరణ నిమిత్తం ప్రతి ఎఫ్‌పి దుకాణం నందు క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేయడం జరిగిందని, దీని ద్వారా ప్రజలు నేరుగా ప్రభుత్వానికితెలియజేయాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న నిత్యావసర వస్తువులు అందరికి సకాలంలో చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు.



# ఎన్ని కోట్లు ఉన్నా..ఆరోగ్యానికి మించిన భాగ్యం లేదు..

**ః- మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్**




మాట్లాడుతున్న మాజీ ఎంపి టీజీ వెంకటేష్

**కల్లూరు, మేజర్‌న్యూస్ ః** ఎన్ని కోట్లు ఉన్నా ఆరోగ్యానికి మించిన భాగ్యం లేదని ఈ విషయాన్ని ప్రతిఒక్కరు గ్రహించాలని మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ అన్నారు. ఏపి మాస్టర్ స్విమ్మింగ్ అసోసియేషన్ వారి ఆద్వర్యంలో ఆదివారం కల్లూరులో మూడవ లిటిల్ మాస్టర్ స్విమ్మింగ్ కాంపిటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ప్రముఖ పారిశ్రామికవేత్త బివి రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ హాజరయ్యారు. అండర్-18వయసు పిల్లలకు, అండర్-18 మహిళలకు అలాగే పిల్లలకు ఫ్రంట్, బ్యాక్ స్ట్రోక్, ఫ్రీ స్టైల్‌లో పోటీలను నిర్వహించినట్లు మాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు లక్ష్మి నారాయణ తెలిపారు. ఈ పోటీలలో దాదాపు 150మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎంపి టీజీ వెంకటేష్ మాట్లాడుతూ బివి రెడ్డి కేవలం వ్యాపార ధోరణిలో కాకుండ స్విమ్మింగ్‌పూల్‌ని అందరి ఆరోగ్యం కొరకు ఏర్పాటు చేశారన్నారు. అందరు ఇండోర్‌పూల్‌ను ఉపయోగించుకోవాలన్నారు. ఇక్కడ ఇండోర్ స్విమ్మింగ్ పూల్‌ను ఏర్పాటు చేయడం అనేది మహిళలకు కూడా చాలా ఉపయోగపడుతుందన్నారు. స్విమ్మింగ్ ప్రాధాన్యత గురించి తెలియజేస్తూ ఎంతో మంది స్విమ్మర్స్‌ను తయారు చేసిన ఘనత లక్ష్మినారాయణకే దక్కిందన్నారు. అనంతరం క్రీడాకారులందరికి టీజీ వెంకటేష్, బివి రెడ్డి, విఠల్ శెట్టిలు మెడల్స్‌ని అందచేశారు.

# ప్రశాంత వాతావరణంలో కానిస్టేబుల్ మెయిన్స్ పరీక్షలు

**ః- జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్**



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ ః** రాష్ట్ర పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు రాష్ట్ర వ్యాప్తంగా ఆదివారం పోలీస్ కానిస్టేబుల్(సివిల్, ఏపిఎస్‌సి) అభ్యర్థులకు నిర్వహించిన మెయిన్స్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించినట్లు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. నగరంలో జి పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల, జి పుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాల, బృందావన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్స్ కళాశాల, కెవి సుబ్బారెడ్డి కళాశాల, ది అథీనా స్కూల్, మాంటిస్సోరి ఇండస్ రెసిడెన్షియల్ స్కూల్, శంకరాస్ డిగ్రీ కళాశాలలో పరీక్షలు జరుగు తున్న తీరును జిల్లా ఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నగరంలో మొత్తం 16పరీక్ష కేంద్రాల్లో 7,597మంది అభ్యర్థులకు గాను 6,947మంది అభ్యర్థులు మెయిన్స్ పరీక్ష రాసినట్లు తెలిపారు. ఎక్కడ అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకో కుండ సిబ్బందిని అప్రమత్తం చేశామన్నారు. జిల్లా ఎస్పీతో పాటు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా, డిఎస్పీలు శ్రీనివాసాచారి, ఉపేంద్రబాబు, హేమలత, సిఐలు, ఎస్ఐలు వున్నారు.

# కాపు భవనం నిర్మాణానికి రూ.కోటి

**ః- సీమలో పరిశ్రమలు ఏర్పాటుతో యువతకు ఉద్యోగ అవకాశాలు**
**ః- బలిజ రాయల్ ప్రతిభ పురస్కారాలు కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి టీజీ భరత్**



ప్రతిభా పురస్కారాలు అందచేస్తున్న మంత్రి టీజీ భరత్

**కర్నూలు కల్చరల్, మేజర్‌న్యూస్ ః** నగరంలో కాపు భవన్ నిర్మాణానికి తన తరపున రూ.1కోటి అందచేస్తానని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ చెప్పారు. నగరంలోని సి క్యాంపులో ఉన్న టీజీవి కళాక్షేత్రంలో కర్నూలు నగర తెలగ, కాపు, బలిజ సేవా సంఘం ఆద్వర్యంలో 10వ తరగతి, ఇంటర్‌లో మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందచేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి టీజీ భరత్ హాజరై విద్యార్థులకు నగదు బహుమతితో పాటు సర్టిఫికేట్లు అంద చేశారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో ప్రతిభ కనబరచాలని సూచించారు. సిఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రానికి పరిశ్రమలు తీసుకొచ్చేందుకు అహర్నిషలు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. లేపాక్షి నుండి కొప్పర్తి, ఓర్వకల్లు వరకు పారిశ్రామిక కారిడార్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. రానున్న రోజుల్లో ఇక్కడ భారీగా పరిశ్రమలు ఏర్పాటవుతాయని తెలిపారు. ఇటీవల బిసీ భవన్ నిర్మాణానికి రూ.1కోటి సహకారం అందిస్తానని ప్రకటించానన్నారు. అలాగే కాపు భవన్ నిర్మాణానికి సైతం రూ.1కోటి తన తరపున అందిస్తానని తెలిపారు. ఇంకా అవసరమైతే ప్రభుత్వం తరపున సహకరిస్తామన్నారు. హైకోర్టు తరహాలోనే కర్నూలులో ఏర్పాటు చేయబోయే హైకోర్టు బెంచ్ భవనం ఉంటుందన్నారు. తమ ఎన్‌డిఏ ప్రభుత్వ ఇలాగే కొనసాగితే అభివృద్ధికి ఆటంకం ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో కాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు ఆర్జా రామకృష్ణ, పత్తి ఓబులయ్య, అనంతనాయుడు, ఆంజనేయులు, చంద్రశేఖర్, విజయభాస్కర్, రాష్ట్ర హజ్ కమిటీ సభ్యులు మన్సూర్ అలీఖాన్, టూరిజం డైరెక్టర్ ముంతాజ్, కార్పొరేటర్ రమణమ్మ, స్వామి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.